తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | మహబూబాబాద్ | నిర్మల్ | మంచిర్యాల | కొమురం భీం అసిఫాబాద్
బుధవారం
26 ఆగస్ట్ 2026
పేజీలు : 19

వరంగల్‌లో అధికారిక కార్యక్రమానికి హాజరుకాని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు

# సీఎంతో వైరం.. మంత్రి కొండాకు లీడర్లు దూరం

## పార్టీలో అంతర్గత విభేదాలు బహిర్గతం



“ తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపు మేరకు వరంగల్‌లో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రి కొండా సురేఖకు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి మధ్య నెలకొన్న విభేదాల నేపథ్యంలోనే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**వరంగల్ (జనంసాక్షి ప్రత్యేక ప్రతినిధి)**

వరంగల్ రంగసాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అధికారిక వనమహోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని భావించినప్పటికీ, వారి గైర్హాజరు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించు కుంది.

**వ్యాఖ్యలతో ముదిరిన వివాదం**

కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మరింత ముదిరింది. ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలను సహించేది లేదంటూ కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కఠిన వైఖరి ప్రదర్శించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంత్రి కొండా సురేఖపై పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు కూడా వినిపించాయి. టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేయడం, దానికి సురేఖ సమాధానం ఇవ్వడం వివాదం తీవ్రతకు అద్దం పడుతోంది.

**ప్రభుత్వ నిర్ణయాలతో మరింత వేడి**

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి తిరిగొచ్చిన అనంతరం అటవీ శాఖలో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న పలువురు అధికారుల డెప్యుటేషన్లను ప్రభుత్వం రద్దు చేయడం కూడా రాజకీయ చర్చకు దారితీసింది. ఈ నిర్ణయం మంత్రి సురేఖకు ముందస్తు సమాచారం లేకుండానే జరిగిందన్న ప్రచారం ఆమెకు, ప్రభుత్వానికి మధ్య దూరం పెరిగిందన్న వాదనలకు బలం చేకూర్చింది.

**అధిష్ఠానం వైపు అందరి చూపు**

వనమహోత్సవం వంటి ప్రభుత్వ అధికారిక కార్యక్రమానికి సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు దూరంగా ఉండటం కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత అసంతృప్తికి స్పష్టమైన సంకేతమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అయితే ఈ గైర్హాజరు పార్టీ అధికారిక నిర్ణయంతో జరిగిన బహిష్కరణా? లేక వ్యక్తిగతంగా ప్రజాప్రతినిధులు తీసుకున్న నిర్ణయమా? అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది.

ప్రస్తుత పరిణామాలతో మంత్రి కొండా సురేఖ రాజకీయంగా ఒంటరిగా మారుతున్నారన్న ప్రచారం ఊపందుకుంది. పార్టీ అధిష్ఠానం ఈ వ్యవహారంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర అంశంగా మారింది.

## గ్రామ పంచాయతీల్లో కనిపించని పరిస్థితి

### పట్టించుకోని జిల్లా అధికారులు

### విచారణ చేపట్టాలని యువత డిమాండ్

# క్రికెట్ కిట్లు ఉన్నట్టా..? లేనట్టా...?

**వెంకటాపూర్ (రామప్ప), ఆగస్టు 25 (జనంసాక్షి)** : గ్రామాల్లోని యువత క్రీడల్లో రాణించాలని ఉద్దేశంతో పాటు క్రీడలు మానసిక శారీరక ఉల్లాసానికి దోహద పడతాయనే నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమం లో భాగంగా వెంకటాపూర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు క్రికెట్ కిట్లను పంపిణీ చేసింది. అదే సమయంలో శాసనసభ ఎన్నికలు రావటం, అట్టి ఎన్నికల్లో గత ప్రభుత్వం మారిపోయింది. దీంతో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లో సదురు క్రికెట్ కిట్లను గ్రామాల్లోని యువతకు పంపిణి చేసేందుకు గ్రామ పంచాయతీ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సదురు కిట్లపై మాజీ ముఖ్యమంత్రి ఫోటో ఉండటంతో అధికార పార్టీ నాయకులు తమ తమ గ్రామాల్లోని క్రికెట్ కిట్ల పంపిణి కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. చేసేదేమీలేక గ్రామ పంచాయతీ అధికారులు అప్పట్లో సదరు క్రికెట్ కిట్లను తమ తమ జిపి కార్యాలయాలల్లోనే భద్రపరిచారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఫోటోతో కూడిన స్టిక్కర్లు ముద్రించి యువతకు క్రికెట్ కిట్లను అందజేస్తామని చెప్పినప్పటికి నేటి ఆది జరగలేదు. ప్రస్తుతం సదురు క్రికెట్ కిట్లు గ్రామపంచాయతీలో కనిపించని పరిస్థితి ఏర్పడింది. గ్రామపంచాయతీలో యువత కోసం భద్రపరిచిన క్రికెట్ కిట్లు ప్రస్తుతం ఉన్నట్టా ..? లేనట్టా ..? అన్న సందిగ్ధత నెలకొంది. ఉంటే అవి ఎక్కడ ఉన్నాయానే సందేహాలు యువత తోపాటు ప్రజల్లో సైతం వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి గత ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీలకు అందించిన క్రికెట్ కిట్ల లెక్క తేల్చి వాటిని గ్రామాల్లోని యువతకు అందించేలా చర్యలు తీసుకోవాలని వెంకటాపూర్ మండల ప్రజలు కోరుతున్నారు.



# ప్రతి ఒక్కరూ వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి

**ప్రిన్సిపాల్ కె. వీరస్వామి**



**తొర్రూరు/నెల్లికుదురు, ఆగస్టు 25 (జనం సాక్షి)::** ప్రతి ఒక్కరూ వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ కె. వీరస్వామి అన్నారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురు ఎన్ఎస్ఎస్ యూనిట్--1 , యూనిట్--2 ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వనమహోత్సవంలో భాగంగా కళాశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ కె. వీరస్వామి హాజరై మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్లు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. మొక్కలు మనకు ఆక్సిజన్‌ను అందించడంతో పాటు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో, భూగర్భ జలాలను పరిరక్షించడంలో, జీవవైవిధ్యాన్ని కాపాడటంలో ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, అడవుల నరికివేత వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఆయన సూచించారు. మొక్కను నాటడం మాత్రమే కాదు, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించడం కూడా మన బాధ్యతని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇమేజెస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మర్సకట్ల అనిల్ కుమార్, పెద్దూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని, తమ ఇళ్ల వద్ద, కళాశాల పరిసరాల్లో మరియు గ్రామాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం శ్రీనివాస్, కవిరాజ్, రామ్మూర్తి, బాబు, మహేందర్, యాకన్న అధ్యాపకేతర బృందం గౌరీ శంకర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కార్తీక్, రాజేష్‌లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మొక్కలను నాటుదాం భవిష్యత్తును కాపాడుదాం

- చెన్నారావుపేట మండల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ నాయక్
- జోజిపేట నారాయణ తండా గ్రామంలో ఘనంగా వన మహోత్సవం



చెన్నారావుపేట, ఆగస్టు 25 ( జనం సాక్షి): మొక్కలను విరివిగా నాటి భవిష్యత్తును కాపాడుదామని చెన్నారావుపేట మండల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని జోజిపేట నారాయణ తండా గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక గ్రామ సర్పంచ్ లావుడియా చందు, ఎంపీడీవో వెంకట సాయి శివానంద్, మండల పంచాయతీ అధికారి తండ జగదీష్, చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్యా గోపాల్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్ లతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటిన మొక్కలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. అంతేకాక ప్రతి ఒక్కరూ వన మహోత్సవం కార్యక్రమంలో భాగస్వాములై విరివిగా మొక్కలను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావుడియా చందు, ఉప సర్పంచ్ నాగోతు ఆరోగ్యం, ఏపీఓ అరుణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధ, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, సీసీ మంజుల, అంగన్వాడీ టీచర్ శౌరీలు, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షులు బండి హరీష్, మంద యాకయ్య గౌడ్, ధర్మ తండా గ్రామ సర్పంచ్ బోడ రవి, జాటోత్ స్వామి నాయక్, ధారావత్ రాములు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు దాసరి దిలీప్, సిపి సుధ, గ్రామ వార్డు సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

**చెన్నారావుపేట మండల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ నాయక్.**



**చెన్నారావుపేట, ఆగస్టు 25( జనం సాక్షి ):** స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని చెన్నారావుపేట మండల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ నాయక్, తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, ఎంపీడీవో వెంకట సాయి శివానంద్, చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్యా గోపాల్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్‌లు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు చెన్నారావుపేట మండల కేంద్రంలోని పాత సొసైటీ కార్యాలయం ఆవరణలో బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామాలలోని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సన్న బియ్యంను ప్రతి పేదవాడికి అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. అలాగే అక్కల్ చెడ గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామ సర్పంచ్ భూక్యా బుజ్జి సురేష్ ఆధ్వర్యంలో చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్, సొసైటీ చైర్మన్ భూక్యా గోపాల్ నాయక్‌లు హాజరై లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి తండ జగదీష్ , కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కంది కృష్ణ చైతన్య రెడ్డి, ఉప సర్పంచ్ దొంతి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షులు బండి హరీష్, మాజీ సర్పంచ్ హంస విజయరామరాజు, జున్నుతుల మహేందర్ రెడ్డి, మంద యాకయ్య గౌడ్, జాటోత్ స్వామి నాయక్, ధారావత్ రాములు, జోరు వీరయ్య, వట్టె తిరుపతి రెడ్డి, పులిశేరు రాజేందర్, మాచర్ల ఎల్ల గౌడ్, జీపీఓలు నరసింహస్వామి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో న్యూట్రి గార్డెన్‌లో మొక్కలు నాటిన సర్పంచ్

**గొట్టుముక్కే సుభాష్**



బజార్హత్నూర్ ఆగస్టు ( జనం సాక్షి):- విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి పోషకాహారం ఎంతో అవసరమని, పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్ల ఏర్పాటు అభినందనీయమని భోస్ర గ్రామ సర్పంచ్ గొట్టుముక్కే సుభాష్ అన్నారు. మండలంలోని భోస్ర ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం న్యూట్రి గార్డెన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలను నాటారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మరియు పోషకాహార ప్రాముఖ్యతపై చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలో నాటిన మొక్కల ద్వారా లభించే తాజా కూరగాయలను మధ్యాహ్న భోజనంలో ఉపయోగించడం వల్ల పిల్లలకు సమతుల్య ఆహారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, వార్డు మెంబర్ దత్తాత్రి, గాడేకర్ పరశురామ్, జి. ప్రభాష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాండ్ర గ్రామంలో వన మహోత్సవం



**సారంగాపూర్,ఆగస్టు25(జనం సాక్షి)** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తాండ్ర గ్రామ సర్పంచ్ వెన్నెల నర్సయ్య అన్నారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అప్పుడే గ్రామం అందంగా ఆహ్లాద కరంగా కనిపిస్తోందన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మీ గంగన్న, పంచాయతీ కార్యదర్శి రఘు కిరణ్, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు గుర్తొచ్చేది ఎన్నికలప్పుడేనా

# కొంపల్లె రోడ్డుపై నారు వేసి బీజేపీ నిరసన



**వెన్నెల, ఆగస్టు 25 (జనం సాక్షి )** నెన్నెల: రోడ్లు గుర్తొచ్చేది ఎన్నికలప్పుడేనా? అంటూ బీజేపీ ఆధ్వర్యంలో కొంపల్లె రోడ్డుపై నారు వేసి నిరసన తెలిపారు. నెన్నెల మండల అధ్యక్షుడు అంగలి శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈ నిరసనలో కొంపల్లె నుంచి గంగారం, చిన్నవెంకటాపూర్ వెళ్లే రహదారుల దుస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారులు పూర్తిగా బురదమయంగా మారడంతో వృద్ధులు, విద్యార్థులు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పింఛన్ తీసుకునేందుకు వృద్ధులు సైతం సుమారు 15 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామ యువతకు వివాహ సంబంధాలు రావడం లేదని పేర్కొన్నారు. గత ఏడాది బీజేపీ ఆధ్వర్యంలో ఇదే రోడ్డుపై నారు వేసి నిరసన తెలిపిన అనంతరం కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 3.15 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అయితే స్థానిక కాంగ్రెస్ నాయకులు రహదారి పనుల కాంట్రాక్టు తమకు లేదా తాము సూచించిన వారికి ఇవ్వాలని పట్టుబడుతూ పనులు ప్రారంభించకుండా అడ్డుకుంటున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా గ్రామీణ ప్రజలు రోడ్లు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాల కోసం ఎదురుచూడాల్సి రావడం దురదృష్టకరమన్నారు. వెంటనే రహదారి పనులు ప్రారంభించి కొంపల్లె ప్రజల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లి తిరుపతి, గడ్డం శ్రీనివాస్ గౌడ్, పెరుగు వెంకటేష్, కోనరవు రాజన్న, కేశవేణి పర్వతాలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

## మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి,ఆగస్టు 25(జనంసాక్షి).** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు పాటుపడాలని, మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా మంగళవారం గట్టమ్మ సమీపంలోని పంచాయతీరాజ్ పైలాన్ ఆవరణలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కలు, అడవులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతోపాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎఫ్‌డీఓ సత్తయ్య, జాకారం సర్పంచ్, అటవీ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలి

## లింగాపురం గ్రామ సర్పంచ్ పురం అనిత రాంబాబు



**చెన్నారావుపేట, ఆగస్టు 25( జనం సాక్షి):** మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలని లింగాపురం గ్రామ సర్పంచ్ పురం అనిత రాంబాబు అన్నారు. మండలంలోని లింగాపురం గ్రామంలో మంగళవారం ఘనంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా ప్రతి ఒక్కరూ సంరక్షించాలని సూచించారు. అలాగే ఇళ్లలో కూడా విరివిగా మొక్కలను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గోపతి అవంతి, పంచాయతీ కార్యదర్శి అనిత, మాజీ వార్డు సభ్యులు గోపతి కుమారస్వామి, కొమురయ్య, నాయకులు తాళ్లపల్లి స్వామి, మామిండ్ల రాజు, మైదం నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ తప్పెట రమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నల్లగుంట లో కాంగ్రెస్ నూతన గ్రామకమిటీ ఎన్నిక

## అధ్యక్షుడిగా సాద రమేష్ ఎన్నిక



**వెంకటాపూర్ (రామప్ప ), ఆగస్టు 25(జనం సాక్షి ):**-మండలంలోని నల్లగుంట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామకమిటీ ని మంగళవారం ఎన్నుకున్నారు. గ్రామకమిటీ నూతన అధ్యక్షుడిగా సాద రమేష్ ఎన్నికయ్యారు. కాగా, ఉపాధ్యక్షుడిగా నారామల్ల కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శులుగా ఇనుముల రాజు లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటి నూతన అధ్యక్షుడు సాద రమేష్ మాట్లాడారు నా ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారం కొరకు శ్రమిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బండి శ్రీను, మండల నాయకులు, గ్రామ సర్పంచ్ భూక్యా శ్రీదేవి శంకర్ నాయక్, ఉప సర్పంచ్ మోరే లింగస్వామి, గ్రామ పెద్దలు మందల ప్రభు రెడ్డి, మునిగంటి తిరుపతి రెడ్డి, కాంతాల నరసింహ రెడ్డి, పిన్నెడ్డి రాజి రెడ్డి, మెరుగు మల్లయ్య, ములుగు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సీనియర్ నాయకులు కొమురవెల్లి రమేష్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మండలమంతా పచ్చదనం పరిమళం



**దేవరుప్పుల ఆగస్టు 25(జనం సాక్షి)** వన మహోత్సవం సందర్భంగా దేవరుప్పుల మండలం వ్యాప్తంగా పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు దేవరుప్పుల లో కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఎమ్మార్వో అహ్మద్ అశ్వక్ పాషా సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ చిన్నమడూరు గ్రామంలో సర్పంచ్ మైదం జోగేశ్వర్ అప్పిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ కొడగాని అనుష నర్సింగరావు ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువత, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో వన మహోత్సవం నిర్వహించడంతో పచ్చదనం సందడి నెలకొంది.

# పచ్చని తెలంగాణ కావాలి

## మానవ మనుగడకు వృక్షాలు దోహదం

## రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**వరంగల్ బ్యూరో, ఆగస్టు 25 (జనం సాక్షి ):** ప్రతి ఇంట మొక్కలు నాటుతూ వాటిని సంరక్షిస్తూ పచ్చని తెలంగాణ చేయడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ నగరంలోని రంగసాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు, అదేవిధంగా ఇక్కడ ఏర్పాటు చేసినటువంటి నూతన ఓపెన్ జిమ్ ను ప్రారంభించారు, అదేవిధంగా స్టాల్స్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథ హాజరైన మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఎల్నీనో ప్రభావంతో వన మహోత్సవం కొంత లేట్ అయిందని అన్నారు. ఈ ఒక్క రోజే 10 శాతం మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటిలో, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో, కార్యాలయాలలో మొక్కలు నాటాలని మంత్రి





సూచించారు. సరైన సమయానికి వర్షాలు పడకపోవడానికి ప్రధాన కారణం సరైన వృక్ష సంపద లేకపోవడమే అన్నారు. వృక్షాలు మానవ మనుగడకు దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి సంరక్షించాలి అనే కృత నిశ్చయంతో ఉండాలని చెప్పారు. ఎవరైనా తమ పుట్టినరోజు ఇతర ఏ శుభకార్యాల లోనైనా మొక్కలు నాటాలని లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. మొక్కలను నాటాలి, పెంచాలి, సంరక్షించాలి కానీ వాటిని నరకవద్దని అన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో 25 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంతో ఉండగా ప్రస్తుతం 12 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగతా మొక్కలు నాటేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సి సి ఎఫ్ భీమా నాయక్ మాట్లాడుతూ వన సంపద సరిగా ఉంటే ఎలాంటి వాతావరణ మార్పులు రాకుండా సమయానికి వర్షాలు కురిసి పంటలు పండుతాయి అన్నారు. అందుకే మొక్కలను నాటాలని వాటిని వృక్షాలుగా చేసేందుకు బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్ఓ నికిత, ఆర్డీవో సుమ, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, తాసిల్దార్ ఇక్బాల్, గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్లు గుండు చందన పూర్ణచందర్, పోషాల పద్మ, కేడల పద్మ వివిధ శాఖల అధికారులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా వనమహోత్సవం

## వన సంరక్షణ అందరి బాధ్యత

## ఉప్పరపల్లి గ్రామ సర్పంచ్ చిలపాక అనిత మొగిలి



**చెన్నారావుపేట, ఆగస్టు 25 ( జనం సాక్షి ):** మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉప్పరపల్లి గ్రామ సర్పంచ్ చిలపాక అనిత మొగిలి పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేజావత్ జయ మాట్లాడుతూ పాఠశాల ఆవరణను పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించడమే వనమహోత్సవం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పాఠశాలను హరిత పాఠశాలగా తీర్చిదిద్దడంలో సమాజ సహకారం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. సంతోష్ కుమార్, పిన్నింటి బాలాజీ రావు, ఏ. ఉదయ్ కుమార్, కె. మాధవి, రమాదేవి, హంస రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ జావేద్, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# జీవన మనుగడకి మొక్కలే జీవనాధారం ఆడెల్లి పార్క్‌లో వనమహోత్సవం

## జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు





**సారంగాపూర్,ఆగస్టు25(జనం సాక్షి)** సారంగాపూర్ మండలంలోని ఆడెల్లి పోచమ్మ హరితవనంలో మంగళవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా భారీ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, చీఫ్ కన్జర్వేటివ్ ఫారెస్ట్ బాసర సర్కిల్ అప్పర్ల, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం వల్ల పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని అన్నారు. మనమంతా ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవనం కొనసాగించాలంటే తప్పనిసరిగా మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, నాటిన మొక్కలను సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని చెప్పారు. మొక్కలు నాటడం వల్ల పచ్చదనం పెంపొందించడమే కాకుండా, ప్రకృతితో బంధాన్ని పెంచుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. మొక్కలు నాటడానికి కేవలం ఒక కార్యక్రమంలా కాకుండా ఒక యజ్ఞంలా చేపట్టి భావితరాలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించాలన్నారు.

**శుభకార్యాలలో గిఫ్టులకు బదులుగా మొక్కలు ఇవ్వండి: జిల్లా ఎస్పీ జానకి షర్మిల**

ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చిన్ననాటి నుండే పర్యావరణ పరిరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. మనం నాటిన మొక్కలు తరతరాలకు ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. విరివిగా మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని కూడా తగ్గించిన వారమవుతామని తెలిపారు. ఎక్కడైనా శుభకార్యాలకు వెళితే గిఫ్ట్ లకు బదులుగా మొక్కలను ఇవ్వండి అని తెలిపారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడితేనే మానవాళికి మనుగడ ఉంటుందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కంకణ బద్దులు కావాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు మహిళా సంఘాలు భాగస్వామ్యం కావాలని చెప్పారు.

**అటవీ విస్తీర్ణ లక్ష్యం పెంచేందుకు ప్రతి ఒక్కరు సహకారం అందివ్వాలి:: చీఫ్ కన్జర్వేటివ్ ఫారెస్ట్ బాసర సర్కిల్ అర్పణ**

అటవీ విస్తీర్ణం పెంచేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని సిసిఎఫ్ బాసర సర్కిల్ అర్పణ తెలిపారు. భౌగోళికంగా అటవీ ప్రాంతం 33 శాతం ఉండాలని, అప్పుడే పర్యావరణ సమతుల్యత ఉంటుందని అన్నారు. జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంచేందుకు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటిని రక్షించాలని కోరారు. పిల్లల పుట్టినరోజులు, వివాహ దినోత్సవాలు, తదితర శుభకార్యాల సందర్భంగా అతిథులకు మొక్కలు బహుమతులుగా ఇవ్వాలన్నారు. జిల్లాలో ఇప్పటికే వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతుందని తెలిపారు. సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ ను వాడకుండా ఉండి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని వివరించారు. కళాజాత బృందాలు పర్యావరణ పరిరక్షణ, చెట్లు పెంచడం వల్ల కలిగే లాభాలను సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా వివరించారు. అనంతరం అధికారులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు కలిసి భారీగా మొక్కలను నాటారు. ఈ వనమహోత్సవం కార్యక్రమంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాస్, ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, ఎంపీఓ అజీజ్ ఖాన్, సర్పంచ్‌లు కూనేరు భూమన్న, దండు సాయన్న, స్థానిక ప్రజలు, విద్యార్థులు, అటవీ శాఖ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటండి ప్రకృతిని కాపాడండి

- నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద
- మహా ముత్తారం సర్పంచ్ కొండ గొర్ల బాబు
- యామన్ పల్లి గ్రామ సర్పంచ్ అట్టెం రమేష్



**మహా ముత్తారం ఆగస్టు 25 (జనం సాక్షి)** అందరూ మొక్కలు నాటి పచ్చదనం ప్రకృతిని కాపాడిన గుర్తింపు కావాలని మహా ముత్తారం గ్రామ సర్పంచ్ కొండగొర్ల బాబు, యామన్ పల్లి గ్రామ సర్పంచ్ అట్టెం రమేష్ అన్నారు. మండలంలోని మంగళవారం మండల కేంద్రంలో మరియు యామన్ పల్లి గ్రామంలో సర్పంచుల ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొండగొర్ల బాబు, అట్టెం రమేష్ మాట్లాడుతూ, ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, యువకులు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో, తాసిల్దార్ దండు శ్రీనివాస్, మండల అభివృద్ధి అధికారి ప్రకాష్ రెడ్డి, ఎస్సై గొర్ల రమేష్, ఫారెస్ట్ రేంజర్ కోటేష్, డిబ్యూటీ, ఫారెస్ట్ రేంజర్ అధికారి ఉష, ఉపాధి హామీ ఏపీవో కుమారస్వామి, ఉప సర్పంచ్ తలారి అఖిల్, జిపిఓ సతీష్, వార్డు సభ్యులు వంగ దేవేందర్, పోసక్కరత్నం అంకక్క,జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీపతి పద్మ, వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ సిబ్బంది, నాయకులు మార్కా బాపు, మరియు యువజన కాంగ్రెస్ నాయకులు మారుపాక రాజేంద్రప్రసాద్, పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు.



# తాళం వేసిన ఇంట్లో చోరీ




**రామకృష్ణాపూర్, ఆగస్ట్25(జనంసాక్షి):** తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన నిందితుడిని రామకృష్ణాపూర్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తిమ్మాపూర్ పద్మావతి కాలనీకి చెందిన రెడ్డిమల్ల శోభారాణి ఈ నెల 24న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 20న శోభారాణి దంపతులు హైదరాబాద్‌లోని కుమార్తె ఇంటికి వెళ్లారు. 24న తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి, అల్మారాలోని ఆభరణాలు అపహరించినట్లు గుర్తించారు. 1½ తులాల వెండి గొలుసు, 6 తులాల ముడి వెండి, 3 తులాల వెండి నాణేలు, బంగారు పుస్తె గుండు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా తిమ్మాపూర్ చౌరస్తాలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను చూసి అనుమానాస్పదంగా తప్పించుకునేందుకు ప్రయత్నించిన సిరికొండ శంకర్ ను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నెల 23న రాత్రి తాళం వేసిన ఇంటిని గుర్తించి తాళం పగులగొట్టి చోరీ చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ సొత్తును విక్రయించి వచ్చిన నగదును వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు వెల్లడించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై జాడి శ్రీధర్ సూచించారు.

# వివాహానికి నేతలకు ఆహ్వానం



**దేవరుప్పుల ఆగస్టు 25 (జనం సాక్షి)** దేవరుప్పులజ్యోతి స్టూడియో వ్యవస్థాపకుడు బండారు యాదగిరి తన కుమార్తె బండారు శిరీష వివాహానికి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతిలను కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రెడ్డిరాజుల రమేష్, దేవరుప్పుల ఫోటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనుముల నాగరాజు పాల్గొన్నారు.

# తిమ్మరాయిని పహాడ్‌లో వన మహోత్సవం

## మొక్కలు నాటిన గ్రామ సర్పంచ్ ధారావత్ రమేష్



**చెన్నారావుపేట, ఆగస్టు 25( జనం సాక్షి):** మండలంలోని తిమ్మరాయిని పహాడ్ గ్రామంలో మంగళవారం ఘనంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ధారావత్ రమేష్ గ్రామంలోని ఎస్సీ కాలనీ, చంద్రు తండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా ప్రతి ఒక్కరూ సంరక్షించాలని సూచించారు. అలాగే ఇళ్లలో కూడా విరివిగా మొక్కలను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పవన్ కుమార్, శౌరీలు, గ్రామపంచాయతీ కార్యదర్శి కాసుల రాంబాబు, కారోబార్ యాకుబ్ పాషా, గ్రామపంచాయతీ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉండి నిష్పక్షికంగా సేవలు అందించాలి

## ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ ఐపిఎస్



**చిట్యాల, ఆగస్టు 25( జనం సాక్షి):** ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నిష్పాక్షికంగా సేవలు అందించాలని భూపాలపల్లి ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ ఐపీఎస్ అన్నారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా చిట్యాల సర్కిల్ ఆఫీస్, పోలీస్ స్టేషన్లో సందర్శించారు. పోలీస్ స్టేషన్కు చేరుకున్న ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా స్టేషన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణతో పాటు పెండింగ్ కేసులు, సిసిటిఎన్ఎస్ నమోదు, బ్లూ కోల్ట్ వాహనాల స్పందన, సీసీ కెమెరాల పనితీరును సమీక్షించారు. స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని లోపాలు ఉన్న కెమెరాలు వెంటనే మరమ్మత్తులు చేయించాలని ఆదేశించారు. రిసెప్షన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్లైన్లో నమోదు చేసి దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్ లో నవీకరించాలని సూచించారు. రౌడీ షీటర్ల పై నిరంతరం మెగా కొనసాగిస్తూ ప్రజలకు స్నేహపూర్వకంగా, పారదర్శకంగా సేవలందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు, సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సై పోచంపల్లి సతీష్, కానిస్టేబుల్ లో లాల్ సింగ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

# చిత్తడి నేలల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

### జలవనరుల హద్దులను క్షేత్రస్థాయిలో పక్కాగాగుర్తించాలి

### జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి,ఆగస్టు 25(జనంసాక్షి).** జిల్లాలోని చిత్తడి నేలల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, జలవనరుల హద్దులను క్షేత్రస్థాయిలో పక్కాగా గుర్తించాలని జిల్లా కలెక్టర్, జిల్లా చిత్తడి నేలల కమిటీ చైర్మన్ బోర్డే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళ వారం నూతన సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి చిత్తడి నేలల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని చిత్తడి నేలల గుర్తింపు, సర్వే, హద్దుల నిర్ధారణ, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తడి నేలలు, జలవనరుల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని జలవనరులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి విస్తీర్ణం, హద్దులకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సర్వే, హద్దుల నిర్ధారణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, సమగ్ర నివేదికను రాష్ట్ర చిత్తడి నేలల ప్రాధికార సంస్థకు పంపించాలని ఆదేశించారు.జలవనరుల పరిశీలనలో నీటిపారుదల, అటవీ, రెవెన్యూ శాఖలు ప్రధాన బాధ్యత వహించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పురపాలక, కాలుష్య నియంత్రణ మండలి, మత్స్య, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లోపించకుండా క్షేత్రస్థాయి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రతి జలవనరును స్వయంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే సంబంధిత శాఖల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ సంపత్, డిపిఓ వెంకయ్య, డిఏఓ సురేష్ కుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, డి ఆర్ డి ఓ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హెవీ వెహికల్స్ సిటీ బయట పార్క్ చేసేల చర్యలు తీసుకోవాలి

## రహదారులపై ఎడ్జ్ లైన్స్ స్పష్టంగా కనిపించాలి

## పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 25 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిఅన్నారు.మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో రోడ్లు, భవనాలు శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రోడ్డు భద్రత సంబంధించి చేపట్టిన చర్యల గురించి ఆర్ అండ్ బి ఈఈ దేవిక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ ప్రతీ వాహనదారులు రోడ్ భద్రత నియమాలను పాటించాలని తెలిపారు రోడ్డు భద్రత నియమాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలియజేశారుఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న హసన్ పర్తి చెరువు కట్ట వద్ద రహదారి వెడల్పు చేయడం జరిగిందని, రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలని, పోతన నగర్ వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ప్రైవేట్ బస్సులు, వాహనాలు రోడ్డు పక్కన ఇష్టారీతిన నిలిపి ఉంచుతున్నారని, వాహన యజమానులతో అధికారులు మాట్లాడి ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్ట్రీట్ వెండర్స్ ఎక్కడపడితే అక్కడ విక్రయాలు చేయకుండా, స్ట్రీట్ వెండింగ్ జోన్లలోనే విక్రయాలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, జిల్లా అదనపు కలెక్టర్ లు ఎన్. రవి,శేషాద్రి,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, జాతీయ రహదారుల శాఖవరంగల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్, ఆర్ అండ్ బీ ఎన్హెచ్ ఈఈ కిరణ్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కుడా సీపీవో అజిత్ రెడ్డి, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, రవాణా, పోలీస్, విద్యుత్, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దోమల పిచికారీ యంత్ర బహుకరణ



**ఆత్మకూరు, ఆగస్టు 25 (జనం సాక్షి):** మంగళవారం రోజు మహాత్మ జ్యోతి బా పూలే పెద్దాపూర్ బాలికల పాఠశాలకు ఆత్మకూరు మండల ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి ఉచితంగా దోమల బెడదను నివారించడానికి ఉపయోగించే యంత్రాన్ని పాఠశాల ఉపాధ్యాయులు శానిటేషన్ వర్కర్స్ సమక్షంలో ప్రిన్సిపాల్ అనిత కు బహూకరించారు. ఈ సందర్భంగా మిషన్ ను ఎలా వాడాలో టెక్నీషియన్ వర్కర్స్ కి సూచించారు. ట్రయల్ కూడా చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్,ఉపాధ్యాయు లందరూ శానిటేషన్ వర్కర్స్ శ్రీనివాసరెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# లింగాపురంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

## గ్రామ సర్పంచ్ పురం అనిత రాంబాబు



**చెన్నారావుపేట, ఆగస్టు 25 ( జనం సాక్షి):** మండలంలోని లింగాపురం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామ సర్పంచ్ పురం అనిత రాంబాబు పంపిణీ చేశారు. బుధవారం గ్రామంలో లబ్దిదారులకు నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. వీటిని గ్రామంలోని లబ్దిదారులు ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ మహమ్మద్ రషీద్, గ్రామ ఉపసర్పంచ్ గోపతి అవంతి, వార్డు సభ్యులు ముదిగొండ బాబు, గ్రామ పెద్దలు తాళ్లపల్లి స్వామి, ఓరుగంటి రాజు, జిపిఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శి అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతగా ప్రతి ఒక్కరు మొక్కలను పెంచాలి

## పాత మగ్దుంపురం ఉప సర్పంచ్ అలువాల శ్రీనివాస్



**చెన్నారావుపేట, ఆగస్టు 25 ( జనం సాక్షి):** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మొక్కలను నాటడంతో పాటు వాటిని బాధ్యతగా సంరక్షించాలని పాత మగ్దుంపురం గ్రామ ఉపసర్పంచ్ అలువాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పాత మగ్దుంపురం గ్రామంలో నెక్కొండ-- నర్సంపేట ప్రధాన రహదారి వెంట నిర్వహించిన మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ అలువాల శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కలు ఎంతో కీలకమని అన్నారు. మొక్కలు నాటడం ఒక్కటే కాకుండా వాటికి క్రమం తప్పకుండా నీరు అందిస్తూ పశువుల బారిన పడకుండా రక్షణ కల్పించి అవి పెద్దవయ్యే వరకు సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణ కుమారి, వార్డు సభ్యులు దొనికెల రాజమాత భార్గవ్, కొయ్యల స్వప్న భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేందర్, గ్రామపంచాయతీ సిబ్బంది కుమార్, సాంబయ్య, ఐలమల్లు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని

## పరకాల ఎమ్మెల్యే గారికి వినతి పత్రం ఎస్ఎఫ్ఐ

### ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్



**పరకాల, ఆగస్టు25, (జనం సాక్షి):** ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు టాయిలెట్స్ మరియు బాత్రూమ్స్ నిర్మించాలని అలాగే గేటు ముందు ఒక అటెండర్ ను నియమించాలని,పరకాల పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ విడుదల చేయాలని, పరకాల పట్టణంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని,వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్ మండల అధ్యక్షుడు కో గీల సాయి తేజ మండల ఉపాధ్యక్షుడు కొమ్ముల రాహుల్ శివ భరత్ సన్నీ మహేష్ సందీప్ జస్వంత్ తదితరులు పాల్గొన్నారు

# కాజీపేట నూతన బస్‌స్టాండ్‌కు భూమి మార్పిడి ప్రక్రియ వేగవంతం చేయాలి

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**కాజీపేట ఆగస్టు 25(జనం సాక్షి)** కాజీపేట నూతన బస్‌స్టాండ్ నిర్మాణానికి అవసరమైన భూమి మార్పిడి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కాజీపేట సిగ్నల్ జంక్షన్ వద్ద దక్షిణ మధ్య రైల్వేకు చెందిన భూమిని రాష్ట్ర ప్రభుత్వ భూమితో సమాన భూ విలువ ప్రాతిపదికన మార్పిడి చేసేందుకు రైల్వే ప్రతిపాదించిన విషయాన్ని మంత్రి దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. ఈ మేరకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి, రైల్వేతో ప్రతిపాదిత భూముల మార్పిడికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. ప్రభుత్వ భూమి లభ్యత, అనుకూలతను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. కాజీపేట నూతన బస్‌స్టాండ్ నిర్మాణం పూర్తయితే కాజీపేటతో పాటు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం రైల్వే, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో భూమి మార్పిడి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, నిర్మాణ పనులకు మార్గం సుగమం చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాజీపేట నూతన బస్‌స్టాండ్ నిర్మాణ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

# డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ పరిశీలించిన డిఏఓ



**చింతలమనేపల్లి ఆగస్టు 25 (జనం సాక్షి)** మంగళవారం రోజున మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి బోర్కూటీ వెంకట్.ఈ సందర్భంగా అయన మాట్లాడుతు వానాకాలం 2026లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఎంపిక చేసి సర్వే నంబర్లలో క్షేత్రస్థాయిలో నమోదు చేయనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా వాలంటీర్లు రైతులు సాగు చేసిన పంటల వివరాలతో పాటు సాగు విస్తీర్ణం, పంట రకం, నీటిపారుదల తదితర వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేస్తారని వివరించారు. డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని అన్నారు. సర్వేలో నమోదైన పంటల సాగు వివరాల ఆధారంగా భవిష్యత్తులో ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు, పంటల కొనుగోలుకు ఈ వివరాలు ఉపయోగపడతాయని తెలిపారు. అందుకు రైతులు తమ పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని ఆయన రైతులకు సూచించారు. వాలంటీర్లు గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండి పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. సర్వే నిర్వహించే వాలంటీర్లకు పూర్తిస్థాయిలో సహకరించాలని, తమ పంటల వివరాలు, సాగు విస్తీర్ణం సక్రమంగా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని కార్తీఈషా వాలంటీర్‌లు పాల్గొన్నారు

# ఏఎంఆర్ కంపెనీలో వనమహోత్సవం

## వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి



**మల్హార్, ఆగష్టు 25(జనంసాక్షి)** మండల కేంద్రమైన తాడిచెర్ల కాపురం గ్రామంలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు వన్ పనులు నిర్వహిస్తున్న ఏఎమ్ఆర్ కంపెనీ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా ఏఎంఆర్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి సి ఎఫ్ ప్రభాకర్,డి ఎఫ్ ఓ కృష్ణ గౌడ్, ఎఫ్ డి ఓ అప్పలకొండ, డి.ఎస్.పి కాటారం సూర్యనారాయణ, ఎఫ్ డి ఓ, ఏ ఎమ్ ఆర్ కంపెనీ సేఫ్టీ మేనేజర్ సురేష్, తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి, ఎ ఏం ఆర్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మద్దులపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**కాళేశ్వరం , ఆగస్టు 25 , ( జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సరిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరిత మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే రేషన్ సౌకర్యాలను మరింత సులభంగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తారని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వాతి, రేషన్ డీలర్ రవి, గ్రామపంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటుదాం భావితరాలను కాపాడుదాం



**నెన్నెల ఆగస్టు 25 (జనం సాక్షి)** నెన్నెల గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గ్రామ సర్పంచ్ ఎండీ ఇబ్రహీం ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు పచ్చదనం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలను నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.. భావితరాలకు పచ్చని భవిష్యత్తును అందిద్దాం” అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పూర్ణచంద్రరావు, డీఆర్వో దయాకర్, ఎంపీవో శ్రీనివాస్, ఎఫ్ఆర్వో ప్రవీణ్, ఏపీవో నరేష్, ఈసీ స్వామి, ఎస్వో కవిత, పంచాయతీ కార్యదర్శి సురేష్, వార్డు సభ్యులు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పాపయ్యపేటలో వన మహోత్సవం

## మొక్కలు నాటిన గ్రామ సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్



**చెన్నారావుపేట, ఆగస్టు 25 ( జనం సాక్షి ):** మండలంలోని పాపయ్యపేట గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్ మొక్కలను నాటారు. నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కత్తెరపల్లి రాజు, వార్డు సభ్యులు మరపల వీరస్వామి, టేకుల స్వామి, బండి రమేష్, మొర్రి కట్టయ్య, మొగిలి కేశవరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ కన్నం తిరుపతి, మొర్రి మల్లయ్య, లింగాల రామ్మూర్తి, మరాటి మల్లయ్య, ఐలయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనమే భావితరాలకు భద్రత



**నెన్నెల, ఆగస్టు 25 (జనం సాక్షి)** ఆవడం: ఆవడం గ్రామపంచాయతీ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ దుర్గం పావని--రాజేందర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో మొక్కల ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బెల్లపు రాజిరెడ్డి, నెన్నెల మండల ఎంపీడీవో పూర్ణచందర్, ఎంపీవో శ్రీనివాస్, వార్డు సభ్యురాలు బెల్లం రాజమణి, ఏపీవో నరేష్, ఈసీ స్వామి, టీఏ కళ్యాణ్, పంచాయతీ కార్యదర్శి ఎన్. శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిరణ్, అంగన్‌వాడీ టీచర్ రత్న రాజేశ్వరి, కారోబార్ అరుణ్, ఫీల్డ్ అసిస్టెంట్ వి. అంకయ్య, విద్యార్థులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు

## ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలి

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**ఆత్మకూరు, ఆగస్టు 25 (జనం సాక్షి):** మంగళవారం గూడెప్పాడు గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణ కు ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు.వాతావరణం సమతుల్యంగా ఉండాలంటే,సరైన సమయంలో వర్షాలు పడాలంటే ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటాలని పిలిపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పరికి రమేష్ బాబు, అక్కంపేట సర్పంచ్ ముద్దం సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి, పరకాల నియోజకవర్గం సేవాదళ్ అధ్యక్షులు ఏరుకొండ రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు కమలాపురం రమేష్, కక్కెర్ల రాజు గౌడ్, పొనుగోటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత

**ఎఫ్ఆర్ఓ లాయక్ హుస్సేన్**



**మంగపేట ఆగస్టు 25(జనం సాక్షి)** మొక్కల పెంపకం, వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగాని మండల ఇంచార్జ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లాయక్ హుస్సేన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో మండల అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల రెవెన్యూ అధికారి ఎమ్మార్వో తోట రవీందర్, ఎంపీడీవో బానోత్ బద్రు, స్థానిక ఎస్సై టివిఆర్ సూరి, సెకండ్ ఎస్సై శ్రీకాంత్, మండల విద్యాశాఖ అధికారి పొదెం మేనక లు హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మొక్కలను పెంచడం ద్వారా నాణ్యమైన గాలిని పొందడం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా మొక్కలు నాటి వాటి సంరక్షణను చేయాలని ఇలా ప్రతి సంవత్సరం కూడా మొక్కలను నాటి మానవ మనుగడను కొనసాగించే విధంగా ప్రతి ఒక్కరు తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

**కలెక్టర్ కుమార్ దీపక్**



**రామకృష్ణాపూర్, ఆగస్ట్ 25(జనంసాక్షి):** మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని గాంధారి వనంలో అడిషనల్ కలెక్టర్ చంద్రయ్యతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మొక్కలు పెంచడం వలన రాబోయే తరాలకు పచ్చని ఆహ్లాదకర వాతావరణం అందుతుందన్నారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా, మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిసిపి ఎగ్గడి భాస్కర్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, ఎస్సై జాడి శ్రీధర్ పాల్గొన్నారు.

# పస్రా పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ వార్షిక తనిఖీ

- **ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలి**
- **శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి**




**గోవిందరావుపేట ఆగస్ట్25( జనం సాక్షి )** ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్ పస్రా పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధులు, పెండింగ్ కేసుల వివరాలను ఎస్పీ సమీక్షించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించి, పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.అలాగే స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, గంజాయి. ఇతర అక్రమ కార్యకలాపాలపై నిఘా మరింత పెంచాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, మరింత సమర్థవంతంగా సేవలందించాలని జిల్లా ఎస్పీ సిబ్బందికి సూచించారు.విధుల్లో అంకితభావం, క్రమశిక్షణతో పనిచేసి పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం పెంచేలా వ్యవహరించాలని తెలిపారు.పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాల వాటి యొక్క రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోగల రౌడీషీటర్లు,సస్పెక్ట్ షీటర్ల కదలికలను గమనించాలని, వారు అసాంఘిక కార్యక్రమాలు చేపడితే వారితో కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలను జారీ చేశారు.అనంతరం స్టేషన్ సిబ్బంది యొక్క సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కార దిశగా ఆదేశాలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు డిఎస్పి నలువాల రవీందర్. పస్రా సీఐ దయాకర్. పస్రా ఎస్ఐ తాజుద్దీన్. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# డబ్బులు ఇస్తే భూములు..
# మరి ఆవులకు మేతకు కూడా డబ్బులు కావాలా?

- **అడవుల్లో భూముల కేటాయింపులపై ఆరోపణలు..**
- **రెబ్బెన మండలం ఫారెస్ట్ అధికారుల తీరుపై గ్రామస్తుల ప్రశ్నలు.**




**రెబ్బెన, ఆగస్టు25(జనం సాక్షి):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, రెబ్బెన మండలం రాజారం--తక్కల్లపల్లి గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో భూముల కేటాయింపుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కొంతమంది డబ్బులు చెల్లించిన వారికి భూములు కేటాయించారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో నిజానిజాలు తేల్చేందుకు సమగ్ర విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఒబ్బెన మండలం ఫారెస్ట్ అధికారులపై కూడా లంచాలు తీసుకుని భూములు కేటాయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు నిర్ధారించబడాల్సి ఉంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై పలు ప్రశ్నలు, ఫిర్యాదులు, వార్తా కథనాలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### భూముల కేటాయింపులో డబ్బులు తీసుకున్నారంటే.. ఆవులకు మేతకు కూడా డబ్బులు కావాలా?”

రాజారం గ్రామపంచాయతీ ప్రజలు మరో కీలక ప్రశ్నను లేవనెత్తుతున్నారు. “అటవీ భూముల కేటాయింపులో డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు వస్తున్నప్పుడు.. మా పశువులు అడవిలోకి వెళ్లి మేత మేయాలంటే కూడా డబ్బులు చెల్లించాలా?” అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు పశువుల మేత సమస్యగా మారుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. కొత్తగా మొక్కలు నాటిన ప్రాంతాలను రక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, అయితే అడవిలోని ఖాళీ ప్రదేశాల్లో పశువులను మేపుకోవడానికి పూర్తిగా ఆంక్షలు విధించడం వల్ల తమ జీవనోపాధిపై ప్రభావం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల మౌనం ఎందుకు?

భూముల కేటాయింపులు ఏ నిబంధనల ప్రకారం జరిగాయి? ఎవరి అనుమతులతో కేటాయింపులు చేపట్టారు? అర్హతలు, రికార్డులను అధికారులు పరిశీలించారా? డబ్బులు తీసుకుని భూములు ఇచ్చారనే ఆరోపణలపై విచారణ ఎందుకు జరగడం లేదనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అదే సమయంలో సాధారణ రైతులు, పశుపోషకుల విషయంలో మాత్రం నిబంధనల పేరుతో కఠినంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు భూముల కేటాయింపులపై అవకతవకల ఆరోపణలు.. మరోవైపు పశువుల మేతపై ఆంక్షలు.. అసలు నిబంధనలు అందరికీ ఒకేలా అమలవుతున్నాయా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### సమగ్ర విచారణకు డిమాండ్

రాజారం--తక్కల్లపల్లి అటవీ ప్రాంతాల్లో జరిగిన భూముల కేటాయింపులు, సంబంధిత రికార్డులు, అర్హతలు, అనుమతులపై ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. లంచాలు తీసుకున్నారనే ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే అధికారికంగా వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

“అటవీ భూములు ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు.. ప్రజల హక్కులు, ప్రభుత్వ నిబంధనలు సమానంగా అమలుకావాలి” అని రాజారం గ్రామపంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

### భూముల కేటాయింపుపై ఆరోపణలకు సమాధానం ఎప్పుడు?

### పశువుల మేత సమస్యకు పరిష్కారం ఎప్పుడు?

ప్రజల ప్రశ్నలకు రెబ్బెన మండలం ఫారెస్ట్ అధికారులు ఏం సమాధానం చెబుతారు.

# తక్కువ నీటితో సాగు చేసే పంటలకు రైతులు ప్రాధాన్యతనివ్వాలి

## బొద్దుగొండ రైతు వేదికలో రైతులు అవగాహనా




**గూడూరు,ఆగస్టు25(జనంసాక్షి):** వర్షాభావం దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేసుకోవాలెనని జిల్లా వ్యవసాయ అధికారి స్వర్ణ విజయ్ చంద్ర,వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాస రావు తెలిపారు. తక్కువ నీరు--తక్కువ పెట్టుబడి--స్థిరమైన ఆదాయం" అనే నినాదంతో రైతులకు వ్యవసాయ సాంకేతికత, పంటల వైవిధ్యం మరియు తక్కువ నీటితో సాగు చేసే పంటలపై మంగళవారం గూడూరు మండలం బొద్దుగొండ రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అధిక నీరు,అధిక పెట్టుబడి అవసరమయ్యే పంటలపై పూర్తిగా ఆధారపడకుండా కంది, పెసర, మినుము, అలసంద, చిరుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటలను పంటల వైవిధ్యంలో భాగంగా సాగు చేయాలని సూచించారు. తక్కువ నీరు – – తక్కువ పెట్టుబడి -- స్థిరమైన ఆదాయం లక్ష్యంగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, సరైన పంటను సరైన సమయంలో ఎంచుకోవడం ద్వారా రైతులు వాతావరణ ప్రతికూలతలను అధిగమించి స్థిరమైన ఆదాయం పొందవచ్చని తెలిపారు .రైతులు వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల సూచనలు తీసుకొని పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తూ, సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం బొద్దుగుండ రైతువేదికలలో నిర్వహించారు . ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ బండ కృష్ణ , రమేష్ , వెంకన్న ,ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో మొక్కలు నాటిన ఎంపీడీఓ, సర్పంచ్



**పర్వతగిరి ఆగస్టు 25 (జనం సాక్షి)** పర్వతగిరి గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రిజర్వాయర్ దగ్గర పోచమ్మ గుడి నుండి మత్తడి వరకు వెళ్లే రోడ్డుకు మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్ నాయక్ గ్రామ సర్పంచ్ చీదురు శంకర్ ఉప సర్పంచ్ చింతకుంట్ల అనిత పాల్గొని మొక్కలు నాటారు

### ఈ సందర్భంగా ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చన్నారు.

### గ్రామ సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ

గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు గ్రామంలో ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి కార్యక్రమం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, గ్రామ సర్పంచ్ శంకర్, ఉప సర్పంచ్ చింతకుంట్ల అనిత, ఏపీఓ సుశీల్, ఈసీ రాజు, ఫారెస్ట్ అధికారి సతీష్, పంచాయతీ కార్యదర్శి రఘు, టెక్నికల్ అసిస్టెంట్ రాజేష్, ఫీల్డ్ అసిస్టెంట్ లింగమూర్తి, వార్డు సభ్యులు,పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# పుస్తక పఠనంతోనే ఉజ్వల భవిష్యత్తు

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**నెరడిగొండ ఆగస్టు25(జనంసాక్షి):** పుస్తకాలను ఇష్టంగా చదివినవారే సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని వాగ్ధరి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని,పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.పుస్తక పఠనం వల్ల సమాజంలో సానుకూల మార్పులు వస్తాయని, ప్రతి ఒక్కరిలో మంచి ఆలోచనలు పెంపొంది గ్రామాలు ఆదర్శంగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సెంట్రల్ లైబ్రరీ తరహాలోనే రాబోయే రోజుల్లో వివిధ ప్రాంతాల్లో పబ్లిక్ రీడింగ్ రూమ్‌లను సైతం అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. చదువు ప్రతి ఒక్కరికీ కీలకమని, యువత తమ కలలను సాకారం చేసుకునేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించిన వాగ్ధరిలోని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు.ప్రతి ఇంటి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా,స్వచ్ఛంగా ఉంచుకోవాలని, గ్రామంలో 4 వేర్వేరు విభాగాలుగా చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్రాక్టర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్,జిల్లా పంచాయతీ అధికారి రమేష్, డీఎల్‌పీఓ ఫణిందర్,జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సురేష్ బాబు గ్రామ సర్పంచ్ విజయ్ కుమార్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**సిర్పూర్ టి, ఆగస్ట్ 25 (జనం సాక్షి ) :** నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఉదయం పౌర సరఫరాల దుకాణం నంబర్ 01 మరియు 02లలో లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసిల్దార్ రహిమొద్దీన్, స్థానిక గ్రామ సర్పంచ్ నాగమణి/నానయ్య, హాజరై లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రహిమొద్దీన్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఈ స్మార్ట్ కార్డులు ఉపయోగపడతాయన్నారు. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల్లోని రేషన్ దుకాణాలలో కూడా ఈ పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని, లబ్ధిదారులందరూ తమ కార్డులను బయోమెట్రిక్ పూర్తి చేసి తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రేషన్ డీలర్లు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వంటింటి దినుసులతోనే ఆరోగ్య సంరక్షణ



**నిర్మల్ టౌన్, ఆగస్టు 25: (జనంసాక్షి )** వంటింట్లో లభించే సహజ దినుసులతో అనేక అనారోగ్య సమస్యలను నియంత్రించవచ్చని ప్రముఖ ఆయుర్వేద, న్యూరోథెరపిస్టు డా. ఉమేష్ గుప్తా తెలిపారు. ఆహార నియమాలు, సరళమైన వ్యాయామంతో పాటు సహజ చికిత్సలను అందిస్తూ ముఖ్యంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. మల్లన్నగుట్ట సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రతి మంగళవారం డా. ఉమేష్ గుప్తా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. చికిత్సతో పాటు సూచించిన ఆహార నియమాలు, జీవనశైలి మార్పులను పాటిస్తే ఆరోగ్య సమస్యలను అధిగమించేందుకు ఉపయోగపడుతుందని వైద్య సేవలు పొందిన రోగులు తెలిపారు. మరింత మంది ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అల్లోల మురళీధర్‌రెడ్డి, వినోదమ్మ, వేణుగోపాల్‌రెడ్డి, మూర్తితో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అధ్వానమైన రహదారితో తిప్పలు పడుతున్న ప్రజలు



**తాండూర్, ఆగస్టు 25(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా: తాండూరు మండలంలోని వేణునగర్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఈ గ్రామం నేషనల్ హైవే రహదారికి ప్రక్కనే సుమారు 25 ఏళ్ళ క్రితం ఏర్పడింది. అప్పటి నుండి ఇప్పటి వరకు కనీస సౌకర్యాలు అయిన సిసి రోడ్లు, మురికి కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల సమయంలో తప్ప ఇటు పక్క కన్నెత్తి చూసే నాయకుడే లేరని అన్నారు. ప్రతి సంవత్సరం ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారులు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మాకు రోడ్లు, మురికి కాలువలు కావాలని అడిగిన ప్రతి సారి ఎవరికి వారు ఏదో ఒక సాకుతో దాటవేస్తోన్నారని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రమాదం జరిగాక స్పందించొద్దు రహదారిపై గుంతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలు జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నందున తాత్కాలికంగా అయినా గుంతలను పూడ్చి రహదారిని ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సమస్యను గుర్తించి పరిష్కరించడం అధికారుల బాధ్యత అని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

## మరో 20 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

### సర్పంచ్ సరోజన



**సిరికొండ ఆగస్టు 25 (జనంసాక్షి) :** సిరికొండ మండలం ఫకీర్‌నాయక్‌తండా గ్రామపంచాయతీకి కేటాయించిన నాలుగు ఇందిరమ్మ ఇండ్లకు అదనంగా మరో 20 ఇండ్లు మంజూరు చేయాలని సర్పంచ్ సరోజన కోరారు. మంగళవారం సిరికొండ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. తండాలో ఇంకా అనేక పేద కుటుంబాలు పూరిగుడిసెల్లోనే జీవిస్తున్నాయన్నారు. తమకు కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని గుడిసెల్లో నివసిస్తున్న పేదలు గోడు వెళ్లబోసుకుంటున్నారని తెలిపారు. తండాలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రత్యేక అధికారితో సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు. అదనంగా 20 ఇళ్లు మంజూరు చేసి గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు సొంతింటి కల నెరవేర్చాలని పేర్కొన్నారు.

## నాటిన మొక్కలను కాపాడాలి: ఎంపీడీవో సంతోష్



**సిరికొండ ఆగస్టు 25 (జనంసాక్షి) :** నాటిన ప్రతి మొక్కను సంరక్షించి బతికించుకోవాలని ఎంపీడీవో సంతోష్ అన్నారు. మంగళవారం సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోస్తూ సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు డిప్యూటీ రేంజ్ అధికారి ప్రియాంక, బీట్ ఆఫీసర్లు భీంజి నాయక్, కోసేరావు, తహసీల్దార్ ఉపేందర్, గ్రామ కార్యదర్శి, గ్రామ పటేల్ బాదు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా వన మహోత్సవం



**ఏటూరునాగారం ఆగస్టు 25 (జనంసాక్షి).** మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం అటవీశాఖ వారి సహకారంతో పెద్ద ఎత్తున వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి రేణుక ప్రారంభించగా ముఖ్య అతిథులుగా హాజరైన మనన్ భట్ (ఏఎస్పి), ఎస్ రమేష్ ఏసిఎఫ్/ఎఫ్డిఒ, ఎమ్మార్వో జగదీశ్వర్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ జె సూర్యప్రకాష్, పంజాల భాస్కర్, ఎఫ్ఆర్ఓ బి మహేష్ ఎస్సై చేతుల మీదుగా కళాశాల ఆవరణంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, మరియు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సిహెచ్ వెంకటయ్య, డాక్టర్ డి నవీన్, డాక్టర్ పి జ్యోతి, కనీస్ ఫాతిమా, సంపత్, జీవవేణి, రమేశ్, శ్రీధర్, రాజశేఖర్, భావన, భారతి, భాస్కర్, శ్రీకాంత్ మరియు బోధనేతర సిబ్బంది, పాత్రికేయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం... పర్యావరణాన్ని కాపాడదాం...



**కడెం: ఆగస్ట్ 25 (జనం సాక్షి)** కడెం మండలంలోని ఉడుంపూర్ గ్రామంలో వనమహోత్సవం, హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్, కడెం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్ గుప్తా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులతో కలిసి సర్పంచ్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జొన్నల చంద్రశేఖర్ గుప్తా మాట్లాడుతూ.. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పచ్చని గ్రామం, ఆరోగ్యకరమైన సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సరిత, ప్రకాశ్, హఫీజ్, అటవీ శాఖ అధికారులు పాండురంగ, సరిత, అటవీ సిబ్బంది సాగర్, పవన్, సునీల్, మహేశ్వర్, రాజేశ్వరి, పరమేశ్వరి, శ్వేత, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ కుర్ర లక్ష్మి లక్ష్మణ్, నాయకులు దొంతుల శ్రీనివాస్, మెంగాని శ్రీనివాస్, బేస్ క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణను కాపాడుకోవాలి

### తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్




**తొర్రూరు, ఆగస్టు 25 ( జనం సాక్షి):** ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణను కాపాడుకోవాలని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ అన్నారు.పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం పట్టణ కేంద్రంలోని స్థానిక జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తొర్రూరు మున్సిపాలిటీ ఎప్పుడు ముందుంటుందని పచ్చదనమే పట్టణ అభివృద్ధికి నిజమైన గుర్తింపు అని అన్నారు ప్రజల సంక్షేమం మౌలిక వసతుల అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ అనే మూడు ప్రధాన లక్ష్యంతో మున్సిపాలిటీ ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రతి ఇంట ఒక మొక్క ప్రతి పౌరుడు ఒక సంరక్షకుడు అనే సందేశంతో ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించి హరిత తొర్రూరు నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో మొక్కలు మాట్లాడడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. "ప్రతి ఇంటా ఒక మొక్క -- ప్రతి పౌరుడు ఒక సంరక్షకుడు" అనే సందేశంతో ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించి హరిత తొర్రూరు నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, పాఠశాల హెచ్ఎం జెల్లా లక్ష్మీనారాయణ,కౌన్సిలర్లు భూసాని జయమ్మ ఉప్పలయ్య, తూర్పాటి రవి, పేర్ల జంపన్న, మాదుగుల భవానీ లత, కిన్నెర కవిత సతీష్, ముద్దసాని సురేష్, కర్నే నాగరాజు, ధారావత్ పద్మ కిషన్, బసనబోయిన ఐలమ్మ,వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతంలో పేసా గ్రామ సభలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- మండల పరిషత్ అభివృద్ధి అధికారికి వినతి పత్రం అందజేసిన గోండ్వాన సంక్షేమ పరిషత్.
- పెసా గ్రామ సభల ద్వారానే ఏజెన్సీ గ్రామాలు అభివృద్ధి బాట.




**నూగూర్ వెంకటాపురం ఆగస్టు 25(జనం సాక్షి ):-** షెడ్యూల్ ప్రాంతాలలో పెసా గ్రామ సభలకే ప్రాధాన్యత ఇవ్వాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ డిమాండ్ చేశారు.ఏజెన్సీలో పెసా గ్రామసభల ద్వారానే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అదేవిధంగా 1/70కి విరుద్ధంగా అక్రమ వలసదారులకు ఇంటి పన్నులు,ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని ఎంపీడీవో కి వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి,జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ మాట్లాడుతూ. ఏజెన్సీ ప్రాంతాలలో పీసా చట్టం ప్రకారం గ్రామ సభలను నిర్వహించి, గిరిజనులకు స్వయం పాలన మరియు స్థానిక వనరులపై పూర్తి అధికారాలు కల్పించాలనీ డిమాండ్ చేశారు.పీసా గ్రామ సభల ముఖ్యమైన అధికారాలు ఉంటాయని, ఆదివాసి భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడటం మరియు కోల్పోయిన భూమిని వెనక్కి తీసుకోవడం.చిన్న తరహా అటవీ ఉత్పత్తులపై పూర్తి యాజమాన్య హక్కులు కలిగి ఉంటాయని అన్నారు.గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులకు, ప్రాజెక్టులకు మరియు లబ్ధిదారుల ఎంపికకు పీసాగ్రామ సభ ఆమోదం తప్పనిసరి ఉండాలని అధికార యంత్రాంగానికి తెలియజేశారు.1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరుల భూములు విక్రయాలపై అలాగే వారి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వాటిపై ఎల్.టి.ఆర్ కేసులు నమోదు చేసి,ఇంటి పన్నులు నియంత్రణ చేయాలని కోరారు.ఆంధ్ర ప్రాంతం నుండి వలస వస్తున్న గిరిజనేతరులకు ఎలాంటి హక్కు కలిగించవద్దని,వారికి ఎలాంటి కాంట్రాక్ట్ పనులు తీర్మానం చేయకూడదని,ఆ కాంట్రాక్ట్ వర్క్ కేవలం ఆదివాసి లకే కేటాయించాలని వెంకటాపురం మండలం సర్పంచులనీ కోరారు.వలస నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని,ఏజెన్సీ గ్రామంలోని సామాజిక వనరుల నిర్వహణ బాధ్యత పిసాగ్రామ సభదే తెలిపారు.రాబోయే రోజుల్లో పిసా గ్రామసభ ముఖ్య ప్రాధాన్యత ఉండాలని,లేని పక్షంలో ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో అనేక ఆ ఆందోళన కార్యక్రమాలు ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు.

## విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేందుకు కృషి చేస్తున్నాం: ఏడిఈ రాములు నాయక్



**గూడూరు,ఆగస్టు25(జనంసాక్షి):** విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేందుకు కృషి చేస్తున్నామని ఏడిఈ రాములు నాయక్ తెలిపారు. మంగళవారం గూడూరు పట్టణం మరియు పరిసర గ్రామాలలో విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా అందించేందుకు సర్పంచ్ సునీత కొమ్మాలు నాయక్ సహకారంతో మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మా సిబ్బంది ఎప్పటికప్పుడు ఫాల్ట్స్ బ్రేక్ డౌన్లు,ముందస్తు మెయింటెనెన్స్ పనులు విద్యుత్ లైన్ల లోపాల సవరణ పాడైపోయిన పరికరాల మార్పిడి లేదా భద్రత పరమైన పనుల కోసం అవసరమైనప్పుడు మాత్రమే తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని,అకస్మకంగా ఏర్పడే ఫాల్ట్ ఫీడర్లు ట్రిప్ కావడం ప్రతికూల వాతావరణ పరిస్థితులు పరికరాలు పాడవడం వంటి అత్యవసర పరిస్థితుల వల్ల కలిగే అంతరాయాలను ముందుగా ఊహించడం సాధ్యం కాదని,అటువంటి సమయంలో క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే స్పందించి వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారని అన్నారు.విద్యుత్ సరఫరా33/11కెవి గూడూరు సబ్ స్టేషన్,11కె వి ఫిడారు మరియు ఎల్టీ లైన్,నెట్వర్క్ లో అవసరమైన మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నామని, సిబ్బంది కొరత ఉందని అన్నారు. టీజీఎన్పీడీసీఎల్ క్షేత్రస్థాయి సిబ్బంది విద్యుత్ అంతరాయాలను తగ్గించడానికి మరియు సరఫరాను వెంటనే పునరుద్ధరించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారని, షట్ షట్ డౌన్ల సమయంలో వినియోగదారులు సంస్థకు సహకరించాలని కోరారు. అనంతరం గూడూరు గ్రామపంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సిబ్బందితో కలిసి కరెంటు వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏడిఈ రాములు నాయక్,ఏఈ కుమారస్వామి, ఎఫ్ఎం మాణిక్యరావు,విద్యుత్ సిబ్బంది,గూడూరు మేజర్ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్, ఉప సర్పంచ్ చంటి స్వామి, చిట్టే వెంకన్న, ఎండీ రసూల్, గ్రామ పెద్దలు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సారంపల్లి మల్లారెడ్డి లాంటి గొప్ప ప్రజా నాయకున్ని కోల్పోవడం అత్యంత బాధాకరం

### స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 25 ( జనం సాక్షి ) :** రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు, సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మృతి దేశ రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని,సారంపల్లి మల్లారెడ్డి లాంటి గొప్ప ప్రజా నాయకున్ని కోల్పోవడం అత్యం త బాధాకరమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ని సీపీఎం కార్యాలయం ఎంబి భవన్ లో సారంపల్లి మల్లారెడ్డి భౌతిక కాయనికి మంగ ళవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి తో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితమే పోరాటంగా భావించి ప్రతిక్షణం వ్యవసాయరంగ అభివృద్ధికి పరితపించిన సారంపల్లి మల్లారెడ్డి నిబద్ధత కలిగిన రైతు ఉద్యమ నాయకుడని తెలిపారు. అఖిల భారత రైతు సంఘం, కమ్యూనిస్ట్ నేతగా రైతాంగ సమస్యలపై అనేక ఉద్యమాలు చేశా రని గుర్తుచేసుకున్నారు. 1987లో రాజకీయా లలోకివచ్చిన నాటినుండి నావెన్నంటేఉంటూ నన్ను అన్ని రకాలుగా ప్రోత్సహించిన వారిలో అత్యంత ప్రథముడు సారంపల్లి మల్లారెడ్డి ని వెల్లడించారు. మల్లారెడ్డి తో కలిసి అనేక ఉద్యమాలలో కలిసి పాల్గొన్నానని, అన్ని ఉద్యమాలకు మల్లారెడ్డి నన్ను కన్వీనర్ గా ముందు వరుసలో నిలిపి రాజకీయ ఎదుగు దలకు సహకరించారని పేర్కొన్నారు. మల్లా రెడ్డి మరణం భారత రైతాంగ ఉద్యమానికి, సీపీఎం పార్టీకి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని లోటని అభివర్ణించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# సర్వాయిపేటలో ఘనంగా వన మహోత్సవం

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి అడవులను నిలబెట్టుకోవాలి -- సర్పంచ్ లంగారి రాజు
- సర్వాయిపేటలో పచ్చదనం పరిమళించేలా.. వన మహోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ లంగారి రాజు, పలిమెల ఎస్సై సాయి శశాంక్





**పలిమెల ఆగస్టు 25 (జనం సాక్షి)** సర్వాయిపేటలో ఘనంగా వన మహోత్సవం: అడవుల రక్షణ, వన్యప్రాణుల పరిరక్షణ మనందరి బాధ్యత. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం సర్వాయిపేట గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమం మంగళవారం అతి వైభవంగా నిర్వహించారు. సర్వాయిపేట గ్రామంలో అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, పోలీసు అధికారులు అదేవిధంగా గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలిమెల ఎస్సై సాయి శశాంక్, ఫారెస్ట్ అధికారులు అదేవిధంగా సర్పంచ్ లంగారి రాజు కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. అడవులు, వన్యప్రాణులపై సర్పంచ్ లంగారి రాజు మాట్లాడుతూ... కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ లంగారి రాజు మాట్లాడుతూ... "అడవులు మన రక్షణ కవచం లాంటివి. అటవీ సంపద తగ్గితే పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వర్షపాతం తగ్గిపోతుంది. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి" అని పిలుపునిచ్చారు. అలాగే, అడవుల్లో ఉండే వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అటవీ సంపదను ధ్వంసం చేయకుండా, క్రూర మృగాలు అదేవిదంగా అటవీ జంతువులకు హాని తలపెట్టకుండా పర్యావరణాన్ని పరిరక్షించాలని పేర్కొన్నారు. పోలీస్ అదేవిదంగా అటవీశాఖ అధికారుల పిలుపు పలిమెల ఎస్సై సాయి శశాంక్ అదేవిదంగా ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ... "ప్రకృతి ప్రసాదించిన అటవీ సంపదను కాపాడుకోవడం పౌరులుగా మన ప్రాథమిక కర్తవ్యం. వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను చెట్టుగా ఎదిగేలా సంరక్షించాలి. అటవీ చట్టాలను గౌరవిస్తూ అడవుల విస్తరణకు, వన్యప్రాణుల రక్షణకు అందరూ సహకరించాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, పోలీసు సిబ్బంది అదేవిదంగా గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆలుబాకలో ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం



**నూగూర్ వెంకటాపురం ఆగస్టు 25(జనం సాక్షి ):-** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని ఆలుబాక పంచాయతీపరిధిలో బృహత్ పల్లె ప్రకృతి వనం నందు వన మహోత్సవం మండల ఎంపివో బొగ్గ నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల పంచాయతీ అధికారి బొగ్గ నారాయణ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించడం భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని ఉద్దేశంతో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన అన్నారు. మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలు నాలుగోఖ సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన వాయు కాలుష్యాన్ని తగ్గించడం వర్షపాతం పెంపొందించడం భూసారని కాపాడడం జీవవైవిద్యాన్ని పరిరక్షణ వంటి అనేక ప్రజలు కలుగుతాయని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లాలయ్య, పంచాయతీ కార్యదర్శి వినోద్,ఫీల్డ్ అసిస్టెంట్ ధనలక్ష్మి,ఉపాధి హామీ పథకం కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పచ్చదనం పెంచడంతోనే పరిపక్వత నేర్చుకుంటారు

### చల్వాయి సర్పంచ్ మేకల రాధ



**గోవిందరావుపేట ఆగస్టు( జనం సాక్షి )-25:** చల్వాయి మోడల్ స్కూల్లో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ మరియు గ్రామపంచాయతీ మోడల్ స్కూల్ సిబ్బంది కలిసి మంగళవారం ఘనంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ మేకల రాధ. ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కు సంబంధించిన ఫారెస్ట్ అధికారు లు కళాశాల ప్రిన్సిపల్ గండు కుమార్. ఉపాధ్యాయబృందం పాల్గొని దాదాపు 40 మొక్కలు నాటడం జరిగింది. పాఠశాలలోని భారత్ గౌడ్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల బృందం. కోఆర్డినేటర్ అపర్ణ, వైస్ ప్రిన్సిపల్ బి వీరకుమార్. స్టాఫ్ సెక్రెటరీ డాక్టర్ దామెర రాజేందర్... ఇద్దరు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు టీడీపీ మండలం అధ్యక్షులు రాజేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన టీడీపీ నాయకులు కందుకూరి నరేష్



**ఆత్మకూర్, ఆగస్టు 25 (జనం సాక్షి):** హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌలపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మరిగిద్దె రాజేశ్వరరావు, సోదరి మణి మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ పరకాల నియోజకవర్గ బాధ్యులు కందుకూరి నరేష్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.అదేవిధంగా తెలుగుదేశం పార్టీ పొలిట్బ్యూరో సభ్యులు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు బక్కని నరసింహులు ఫోన్ ద్వారా రాజేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీని నమ్ముకుని పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, మరిగిద్దె రాజేశ్వరరావు, కుటుంబానికి కూడా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, అక్క ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ దామెర మండల అధ్యక్షుడు నల్లా రవి,, టీఎన్ఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి దండుగుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు



**పాలకుర్తి, ఆగస్టు 25(జనంసాక్షి)** మండలంలోని దుబ్బతండా (ఎస్పీ) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఉపసర్పంచు భూక్య కిషన్, వార్డు సభ్యులు భూక్యా బాలు, గుగులోతు జెలేందర్, బీఆర్ఎస్ నాయకుడు 'ఆపావత్ నరేష్ లు మంగళవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడా యశస్వినిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వారికి కాంగ్రెస్ కుడువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో, నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ లో చేరుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికి అందేలా ప్రభుత్వం ఆదిశగా పని చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాపాక సత్యనారాయణ, పోగు శ్రీనివాస్, మారుజోడు సంతోష్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో వనమహోత్సవం

### మొక్కలు నాటిన ఎస్పీ సంకీర్త్, డీఎఫ్ఓ కిష్టగౌడ్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, డీఎఫ్ఓ కిష్ట గౌడ్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం వల్ల పచ్చదనం పెరగడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకర వాతావరణం అందుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16.03 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ రత్నం, వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్ కుమార్, ఎంటీవో ఆర్ఐ పూర్ణచందర్, స్పెషల్ పార్టీ ఆర్ఐ కాశీరాం, అటవీ శాఖ అధికారులు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ మహిళలకు ఇందిరమ్మ కుట్టు మిషన్ల పథకం

### దరఖాస్తులకు సెప్టెంబర్ 15 వరకు గడువు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలోని నిరుద్యోగ బీసీ మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిర తెలిపారు. ఈ పథకం కింద ఆటోమేటిక్ కుట్టు మిషన్లను నూరు శాతం సబ్సిడీతో అందిస్తామని, ఆసక్తి గల మహిళలు వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్‌లో సెప్టెంబర్ 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 18 నుండి 55 ఏళ్ల లోపు నిరుద్యోగ బీసీ మహిళలు, పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, అనాథ మహిళలు, టైలరింగ్ శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. కనీసం 5వ తరగతి ఉత్తీర్ణులై, తెల్ల రేషన్ లేదా ఆహార భద్రత కార్డు, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, గ్రామీణులకు ఏడాది ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ వాసులకు రూ.2 లక్షలలోపు ఉండాలని పేర్కొన్నారు. 2023-24లో బీసీ ఒకేషనల్ స్కీం కింద లబ్ధి పొందిన వారు అనర్హులని తెలిపారు. దరఖాస్తులను డౌన్ లోడ్ చేసుకుని సంబంధిత పత్రాలతో గ్రామీణులు మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ వాసులు మున్సిపల్ కమిషనర్‌కు సెప్టెంబర్ 15 లోగా అందజేయాలని సూచించారు.

## వన మహోత్సవంలో భాగంగా

### మొక్కలను నాటిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల, ఆగస్టు25, (జనం సాక్షి )** మంగళవారం పరకాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని అన్నారు.ప్రతి గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు.

# బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కరుణాకర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బూత్ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ మండల అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా పరిధిలోని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ పరంగా మండల అధ్యక్షులు అనుసరించాల్సిన విధానాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలు, సంస్థాగత నిర్మాణం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రధానంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతం చేయడం, ప్రతి అర్హుడి ఓటు హక్కును పరిరక్షించడంపై మండల అధ్యక్షులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 27న జరగనున్న గ్రామ సభల్లో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులు, నాయకులు తప్పనిసరిగా పాల్గొని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి మరణించిన వారు, నకిలీ ఓట్లు, గైర్హాజరు / వలస వెళ్లిన వారి వివరాలను ప్రజలకు వివరించాలని, కొత్త ఓటు నమోదు, తొలగింపు, సవరణలకు సంబంధించిన దరఖాస్తులపై అవగాహన కల్పించి అవసరమైన వారికి సహాయం అందించాలని సూచించారు. అదేవిధంగా ప్రతి గ్రామం, బూత్ స్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేస్తూ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు, వివిధ మండలాల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, కటకం అశోక్, తాళ్లపల్లి భాస్కరరావు, పున్నం రవి, దబ్బెట అనిల్, రఫీ, శీను, జాడి రాజయ్య, రాజేందర్, తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నగరానికి అందం.. పర్యావరణానికి ప్రాణం.. మొక్కలే ఆధారం

- మొక్కలు నాటుదాం.. వరంగల్‌ను పచ్చని నగరంగా తీర్చిదిద్దుదాం
- వనమహోత్సవంలో భాగంగా తోట మైదానంలో సామూహిక మొక్కలు నాటిన కమిషనర్



**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 25(జనంసాక్షి):** నగరానికి అందం.. పర్యావరణానికి ప్రాణం.. మొక్కలే ఆధారమని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న అన్నారు.వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్ నగరంలోని తోట మైదానంలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టీ. వెంకన్న ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మొక్కలు నాటుదాం.. వరంగల్‌ను పచ్చని నగరంగా తీర్చిదిద్దుదామని అన్నారు.నగరంలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడంతో కార్యక్రమం పూర్తికాదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అవి వృక్షాలుగా ఎదిగేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంట, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో అనువైన మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, రక్షణ కల్పించడం, మొక్కల పెరుగుదలను పర్యవేక్షించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలు కూడా వనమహోత్సవ కార్యక్రమాల్లో భాగస్వాములై తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. పచ్చని, పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వరంగల్ నగర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బస్వరాజ్ కుమారస్వామి,సిహెచ్ ఓ లక్ష్మారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేశ్, ఇంజనీరింగ్, హార్టికల్చర్ విభాగాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అజీమ్ ప్రేమ్ జీ స్కాలర్షిప్‌పైన అవగాహన




**ములుగు, ఆగష్టు 25(జనంసాక్షి).** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ములుగులో మంగళవారం అజీమ్ ప్రేమ్ జీ స్కాలర్షిప్ పైన అవగాహన కల్పించడం జరిగింది. దీనికి సహృదయ ఫౌండేషన్ నుండి గీతాంజలి మేడం కళాశాలకు వచ్చి విద్యార్థులకు అజీమ్ ప్రేమ్ జీ స్కాలర్షిప్ పైన అవగాహన కల్పించడం జరిగింది. దీనికి కళాశాల ఇన్చార్జీ ప్రిన్సిపల్ డాక్టర్ బి బాలయ్య అధ్యక్షత వహించి స్కాలర్షిప్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. మరియు కళాశాల అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.భాస్కర్ సార్ మరియు ఐక్య ఏసి కోఆర్డినేటర్ డాక్టర్.కవిత అదే విధంగా స్కాలర్షిప్ ఇంచార్జి డాక్టర్ పి విజీత అజీమ్ ప్రేమ్ జీ స్కాలర్షిప్ పైన విద్యార్థినీ లకు అవగాహన కల్పించడం జరిగింది. అజీమ్ ప్రేమ్ జీ స్కాలర్షిప్ గర్ల్స్ స్టూడెంట్స్కు ఎవరైతే టెన్త్, ఇంటర్ గవర్నమెంట్ స్కూల్ మరియు గవర్నమెంట్ కాలేజీలో చదివిన వారు దీనికి అర్హులు. ఈ స్కాలర్షిప్ పైన ప్రతి విద్యార్థినికి సంవత్సరంనకు 30 వేల చొప్పున మూడు సంవత్సరములకు కలిపి 90,000 రూపాయలు తమ యొక్క అకౌంట్లో జమ అవును, ఈ స్కాలర్షిప్ ఆన్లైన్లో అప్లై చేయడానికి కావలసిన డాక్యుమెంట్స్ కూడా సరియైన పద్ధతిలో అప్లోడ్ చేయవలెను, ఈ ప్రోగ్రాంలో కళాశాల అధ్యాపక మరియు అధ్యాపక యేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు కాపాడాలి

## సర్ ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఇంచార్జీ, ఎమ్మెల్సీ శంకర్ నాయక్



**పాలకుర్తి, ఆగస్టు 25(జనంసాక్షి)** అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందని, సర్ ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఇంచార్జీ, ఎమ్మెల్సీ గుగులోతు శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వీ.కన్వెన్షన్ హాలులో సర్ రెండో విడత కార్యచరణపై నియోజకవర్గ స్థాయి సమావేశం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా శంకర్ నాయక్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ శ్రేణులు, పార్టీ అభిమానులు. సానూభూతిపరులు ఓట్లను పోలింగ్ బూత్ల వారిగా ఓటరు జాబితా ఆధారంగా విశ్లేషించుకోవాలని సూచించారు. తేడాలున్న (అనామలీస్) ఓట్లు భారీ సంఖ్యలో ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సర్ ప్రక్రియలో పేదలు, వలస కూలీల ఓట్లనే ఎక్కువగా తొలగించారని, 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ లాగే ఎన్నికల సంఘాన్ని కూడా తన జేబు సంస్థగా మార్చుకుందని అన్నారు. 2002 నాటి ఓటర్ల జాబితాతో ముడిపెట్టకుండా పౌరులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. రాష్ట్రంలో అకారణంగా 70 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందని అన్నారు. మొత్తంగా 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకంగా చేసిందని విమర్శించారు. డీలిమిటేషన్ పోలింగ్ కేంద్రాల మార్పు వల్ల 2002 నాటి వివరాలు సరిగా లేవన్నారు. లక్షల మంది ఓట్లు తొలగించి ప్రజాస్వామ్య దేశమంటే ఎలా అని ప్రశ్నించారు. సర్ రెండో విడత అత్యంత కీలకమైందని, ప్రతి బూత్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బీఎల్ఏ లే వెన్నెముకగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్, డీసీసీ అధ్యక్షురాలు లాకావత్ ధన్వంతి, రాపాక సత్యనారాయణ, పోగు శ్రీనివాస్, లావుడ్యా మంజుల, భాస్కర్, జల్గం కుమార్, కారుపోతు శ్రీనివాస్, పెనుగొండ రమేష్, ఎండి. మదార్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటుకు సంయుక్త తనిఖీ



**తాండూర్, ఆగస్టు 25(జనం సాక్షి)** దక్షిణ మధ్య రైల్వే సంస్థ చేపట్టిన రైల్వే లైన్ విస్తరణ, అభివృద్ధి పనులలో భాగంగా తాండూర్ మండలంలో రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. మండలంలోని రేపల్లెవాడ లెవెల్ క్రాసింగ్ ( ఎల్ సి.68, కి.మీ 226/12-14) వద్ద, రెచ్చిణి రోడ్ - రేపల్లెవాడ స్టేషన్ల మధ్య ప్రతిపాదిత ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ స్థలాన్ని మంగళవారం అధికారులు సంయుక్తంగా పరిశీలించారు.రైల్వే క్రాసింగుల వద్ద ప్రయాణికుల భద్రత, రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు రైల్వే శాఖ రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తాండూర్ మండలం రేపల్లెవాడ, కొత్తపల్లి గ్రామాల సరిహద్దుల్లోని లెవెల్ క్రాస్ వద్ద జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు.ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్ల పరిశీలన:ఈ సంయుక్త తనిఖీలో భూసేకరణకు సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. బ్రిడ్జ్ నిర్మాణం కోసం అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్లను (రూట్లను) అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాజెక్ట్ వల్ల నష్టపోయే భూములు, ఆస్తుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు బ్రిడ్జ్ నిర్మాణానికి సంబంధించి పలు సలహాలు,సూచనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ఐఏఎస్, తాండూర్ తాసిల్దార్ జ్యోత్స్న, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సుందర్, రైల్వే రోడ్ సెక్టార్ ప్రాజెక్ట్ భూసేకరణ నిపుణులు పి. దేవరాజు వారితో పాటు జాతీయ రహదారుల సంస్థ , ఆర్ అండ్ బీ, అటవీ శాఖ, నీటి పారుదల శాఖ, పంచాయతీరాజ్ విభాగాల అధికారులు, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ మరియు స్థానిక ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# సిర్పూర్‌లో ఘనంగా వనమహోత్సవం

- దుబ్బగూడ ప్లాంటేషన్‌ను పరిశీలించిన సీసీఎఫ్
- పర్యావరణ పరిరక్షణ భావి తరాల బాధ్యత,
- దుబ్బగూడ పులిరణస్థలి' ప్లాంటేషన్‌పై ప్రశంసా

**సిర్పూర్ టి, ఆగస్ట్ 25 (జనం సాక్షి ) :** పర్యావరణాన్ని, అడవులను, వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత భావి తరాలైన విద్యార్థులపైనే ఉందని కంపా సీసీఎఫ్ క్షితిజ ఐ.ఎఫ్.ఎస్ పేర్కొన్నారు. మంగళవారం సిర్పూర్(టి)లోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో, వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై స్తానీక సర్పంచ్ తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా క్షితిజ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమె దుబ్బగూడలోని అటవీ ప్లాంటేషన్‌ను సందర్శించి, మొక్కల సంరక్షణ తీరును పరిశీలించారు. ప్లాంటేషన్‌ను విజయవంతం చేసినందుకు అటవీశాఖ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా ఆ ప్రాంతానికి, పులిరణస్థలి అని పేరు పెట్టడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేస్తూ, ఆ పేరు వెనుక ఉన్న విశేషాలను సెక్షన్ ఆఫీసర్ మోహన్ రావును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీపీటీ శాంతారాం, ఐ.ఎఫ్.ఎస్,ఎఫ్‌డీవో భార్గవ్ కుమార్, ఐ.ఎఫ్.ఎస్,ఏసీఎఫ్‌లు డా. అప్పయ్య, వేణుబాబు, ఎఫ్ఆర్ఓలు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, సర్పంచ్ నాగమణి



నానయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో మొక్కలు నాటిన సర్పంచ్



**కాళేశ్వరం , ఆగస్ట్ 25 , ( జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని స్మశానవాటిక ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా సర్పంచ్ సరిత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఇంటి వద్ద ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి స్వాతి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పస్రాలో ఘనంగా వన మహోత్సవం

## పస్రా గ్రామపంచాయతీ సర్పంచ్ సుమలత



**గోవిందరావుపేట ఆగస్టు 25(జనం సాక్షి)** మండలంలోని పస్రా గ్రామంలో మంగళవారం సర్పంచ్ సుమలత ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ మనం మొక్కలను నాటితే అవి మానవాళిని కాపాడుతాయని అన్నారు. వర్షాలు సకాలంలో కురవాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పచ్చదనం మేఘాలను ఆకర్షిస్తుందని తద్వారా వర్షాలు పడతాయని అన్నారు ఉపసర్పంచ్ సప్పిడి సంజన రెడ్డి. ఎంపీడీవో వరుణ్ కుమార్. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సెక్షన్ ఆఫీసర్ పంచాయతీ కార్యదర్శి సతీష్. ఉపాధి హామీ ఈసీ సిఏ టెక్నికల్ అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్ వార్డు సభ్యులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బిపి మండల్ జయంతి



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 25 (జనం సాక్షి) :** బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బిందేశ్వర్ ప్రసాద్ మండల్ 108వ జయంతి ఘనంగా నిర్వహించడం జరిగింది. మంగళవారం హనుమకొండ చౌరస్తాలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు బత్తిని సదానందం అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ దేశంలో బహుజనుల జీవన విధానంపై సర్వే నిర్వహించి వారి అభివృద్ధికి సిఫారసులు చేయాలని రెండవ బీసీ కమిషన్ కు మండల్ అధ్యక్షతన ఐదుగురు సభ్యులతో కలిపి బీపీ మండల్ కమిషన్ ను నియమించడం జరిగిందని చెప్పారు. బీపీ మండల్ బీసీల కులపరమైన వివక్షత ఆర్థిక వెనుక పాటుతనంపై, విద్యకు దూరంగా ఉండడం పై ఆస్తి లేకుండా పూరి గుడిసెలో కనీస సౌకర్యాలు లేకుండా 52 శాతం బీసీలు ఉన్నారని రెండవ మండల్ బీసీ కమిషన్ రికమండు చేయడం జరిగిందన్నారు. మండల్ సూచన మేరకే విద్యా ఉద్యోగ రంగాలలో 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని తెలిపారు. చట్టసభలలో స్థానిక సంస్థలలో విద్యా ఉద్యోగాలలో, కాంట్రాక్టులు, ప్రైవేట్ రంగంలో కూడా జనాభా ఆధారంగా 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నవచేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, తిక్క సూర్యప్రకాష్, ఎర్ర విజయ, మంద కవిత, పి కృష్ణ, ప్రభాకర్, కుమారస్వామి, కుక్కల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతితో జీవన విధానం ముడిపడి ఉన్నది

### కొన్నే సర్పంచ్ స్వర్ణలతా శివకుమార్ గౌడ్



**బచ్చన్నపేట ఆగస్టు 25 ( జనం సాక్షి):** ప్రకృతితో మనిషి జీవన విధానం ముడిపడి ఉన్నదని బచ్చన్నపేట మండలంలోని కొన్నే గ్రామ సర్పంచ్ కోడూరు స్వర్ణలత శివకుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం గ్రామంలో కలెక్టర్ ఆదేశానుసారం నిర్వహించిన వనమోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన వాతావరణాన్ని ఆరోగ్యకరమైన జీవనాన్ని భావితరాలకు అందించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా కొన్నే గ్రామంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ భాగ్యరాజు. పిఏ భానుచందర్. ఏపీవో కృష్ణ. ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్లయ్య. గ్రామస్తులు ఉన్నారు.

## వన మహోత్సవంలో భాగంగా స్కూల్ పిల్లలతో కలిసి మొక్కలు నాటిన గ్రామ సర్పంచ్ చేదురు శంకర్







**పర్వతగిరి ఆగస్టు 25 : (జనం సాక్షి)** వన మహోత్సవంలో భాగంగా విశ్వ జనిత్ స్కూల్ ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాన.సర్పంచ్ చీదురు శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో, స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కల ప్రాముఖ్యతను విద్యార్థులకు కలసి వివరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నతనం నుండే పిల్లలలో మొక్కల పట్ల ప్రేమను పెంపొందించాలని, చెట్టును నాటి దానిని కాపాడితే అది మనకు ప్రాణవాయువును ఇస్తుందని అన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ చేదురు శంకర్ వార్డ్ నెంబర్ పుల్లూరి రజినీకాంత్ గౌడ్ కాంగ్రెస్ నాయకులు నరెడ్ల సంతోష్ బొట్ల ఎంకన్న పాఠశాలల యజమాన్యం ఎర్రబెల్లి సంపత్ రావు సునీల్ కుమార్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన తీగలవేణి విద్యార్థులు

### పధానోపాధ్యాయులు ఎస్. ఎ.ఫారుఖ్.



**గూడూరు,ఆగస్టు25(జనంసాక్షి):** రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గూడూరు మండలం తీగలవేణి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయులు ఎస్ ఎ ఫారుఖ్ హర్షం వ్యక్తం చేశారు.ఇటీవల మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ వారు నిర్వహించిన సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ లో 8వ, తరగతికి చెందిన జె. సౌజన్య 14సం,,బాలికల రాల ట్రైయతలన్ సీ గ్రూపు ఈ వెంట్ లో ఒకటవ, రెండవ,స్థానములు సాధించిందని, 8వ,తరగతి చెందిన ఎమ్. ప్రీతిక ట్రై యతలన్ బి గ్రూప్ ఈవెంట్ లో ఒకటవ, రెండవ స్థానాలు సాధించింది. 16సం,, రాల విభాగంలో 9వ, తరగతికి చెందిన ఎమ్. భార్గవి లాంగ్ జంప్ లో రెండవ స్థానం, షాట్ పుట్ లో రెండవ స్థానం, 600,60మీటర్ల పరుగు పందెం లో మూడవ స్థానం సాధించిందని, పి.శేషు హడిల్స్ 80మీ. లో మొదటి స్థానం సాధించి తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ జేఎన్ హనుమకొండలో ఈనెల 26,27 తేదీలలో నిర్వహించే రాష్ట్రస్థాయి సౌజన్ జూనియర్ అథ్లెటిక్స్ కు ఎంపికయ్యారని తెలిపారు.ఎంపికైన విద్యార్థులను ప్రధాన ఉపాధ్యాయులు ఫారుఖ్, ఫిజికల్ డైరెక్టర్ గొల్లపూడి రాణి,సర్పంచ్ దారవత్ రాజు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేదు

### ప్రతి రోజు చెత్త సేకరణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 25(జనంసాక్షి):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్టంగా చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.మంగళవారం నగరంలోని పలు డివిజన్లలో ఆకస్మికంగా పర్యటించి చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు.మోడల్ డివిజన్ గా ఎంపిక చేసిన 13వ డివిజన్ శ్రీనివాస కాలనీ, నవయుగ కాలనీలలో పర్యటించిన కమిషనర్ ఇంటింటి చెత్త సేకరణ, తడి--పొడి, హానికరమైన చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక గృహిణులు, ప్రజలతో నేరుగా మాట్లాడి చెత్త సేకరణ ఆటో ప్రతిరోజూ వస్తుందా, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.అదే కాలనీలో నిర్మాణ వ్యర్థాలను డ్రైనేజీలో పడవేసిన విషయం కమిషనర్ దృష్టికి రావడంతో, సంబంధిత వ్యక్తులను గుర్తించి నిబంధనల మేరకు జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం చిన్న వడ్డేపల్లి చెరువు ప్రాంతంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్, నిమజ్జనానికి ముందే ప్రాంతంలో ఎక్కడైనా చెత్త పేరుకుపోయి ఉంటే వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. వినాయక చవితి సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాత కరవాణి ప్రాంతం మొత్తం పరిశుభ్రంగా, నీట్‌గా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.తదుపరి రంగసాయిపేట డిగ్రీ కళాశాలను సందర్శించిన కమిషనర్, వన మహోత్సవ కార్యక్రమంలో మంత్రి కొండ సురేఖ పాల్గొనుచున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, ఇతర అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో సానిటరీ సూపర్‌వైజర్ గోపాల్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం చేయండి - చిరంజీవులు కండి

- అదనపు కలెక్టర్ విజయలక్ష్మి.. • జయశంకర్ భూపాలపల్లిలో 41వ నేత్రదాన పక్షోత్సవాలు.



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అంధులకు ఆశాజ్యోతి నేత్రదానమేనని, మరణానంతరం దానం చేసిన కళ్లతో ఇద్దరు అంధులకు చూపును ఇవ్వవచ్చని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ఎల్. విజయలక్ష్మి అన్నారు. నేత్రదానం ఒక కుటుంబ సంప్రదాయం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్ లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం 41వ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ దేవేందర్ అధ్యక్షతన నేత్రదాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. నర్సింగ్ విద్యార్థులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమాజంలో నేత్రదానంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరత్నం మాట్లాడుతూ పక్షోత్సవాల సందర్భంగా జిల్లా సాధారణ ఆసుపత్రిలో కంటి వైద్యులచే ప్రత్యేక పరీక్షలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేత్రదానంపై కూడా అవగాహన కల్పిస్తామని తెలిపారు. జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ దేవేందర్ మాట్లాడుతూ మరణానంతరం ప్రతి వ్యక్తి కళ్లను కాల్చకుండా నేత్రదానం చేసి ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు నింపాలని సూచించారు. అనంతరం ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సమావేశంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సందీప్, డాక్టర్ రాహుల్, నేత్ర వైద్య అధికారి బూరుగు రవికుమార్, సత్యనారాయణ, ఆరోగ్య విద్యావేత్త శ్రీదేవి, హెచ్ఈఓ మురళీధర్ రెడ్డి, జమాలుద్దీన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడమే కాదు వాటి పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత

- పచ్చదనం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత • నడికూడ వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే..



**నడికుడ ఆగస్టు 25 (జనం సాక్షి) :** పచ్చదనంపరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరు అమ్మ పేరు మీద మొక్క నాటి అట్టి మొక్కను సంరక్షించుకోవాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు విరివిగా కురవాలంటే మొక్కలు విరివిగా నాటాలని వాటి పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నడికుడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణం లాగా కొనసాగిందని గ్రామ గ్రామాన పచ్చదనం పర్యావరణం ప్రతి ఒక్కరి లక్ష్యంగా మొక్కలు నాటడం జరిగిందని మొక్కలు నాటడం కాదు వాటి సంరక్షణ కూడా పూర్తి బాధ్యత వారే తీసుకుని సంరక్షించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి మండల తహసిల్దార్ రాణి ఎంపీడీవో రామకృష్ణ ఏపీవో విద్యావతి స్థానిక సర్పంచ్ మలహాలు రావు మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పెద్ద బోయిన రవీందర్ యాదవ్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి పలు గ్రామాల సర్పంచులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పలు శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: జిల్లా కలెక్టర్ రాజర్షిషా

## మొక్కలతోనే స్వచ్ఛమైన వాతావరణం: ఎస్పీ అఖిల్ మహాజన్



**మావల ఆగస్ట్ 26 ( జనం సాక్షి):** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం 'వన మహోత్సవం' కార్యక్రమంలో భాగంగా నేరడిగొండ మండలం వాగ్దారి గ్రామ సమీపంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన మొక్కలను నాటి నీరు పోసి పచ్చదనం ప్రాముఖ్యతను చాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం 'వికసిత్ భారత్ -2047 లక్ష్యం సాధన ధ్యేయంగా "మొక్కలు నాటుదాం -- పర్యావరణాన్ని కాపాడుదాం -- పచ్చని భవిష్యత్తును నిర్మిద్దాం" అని పిలుపునిస్తూ, ప్రతి ఒక్కరూ నైతిక బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల పెంపకం ఎంతగానో దోహదపడుతుందని స్పష్టం చేశారు. వన మహోత్సవం కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు ప్రజలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి అధికారి విశ్వనాథ్ బుస రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌ను అకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ జానకి షర్మిల




**సారంగాపూర్,ఆగస్టు25(జనం సాక్షి)** నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌నుమంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు, స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు పోలీస్ స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సానుకూలంగా విని, చట్టపరంగా సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నిబంధనల ప్రకారం నమోదు చేసి, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిరంతరం నిఘా ఉంచాలని, రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేసి దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. మహిళలు, బాలల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. బీట్ వ్యవస్థను పటిష్టం చేసి గ్రామాల్లో నిరంతరం పర్యటించాలని, డయల్-112 ద్వారా వచ్చే సమాచారంపై వెంటనే స్పందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, ఇతర రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని, విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ గారు ఆదేశించారు. ఇట్టి తనిఖీ లో డీఎస్పీ శ్రీనివాస్, నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

# సిపిఎం నేత సారంపల్లి మల్లారెడ్డికి ఘన నివాళి




**తాండూర్, ఆగస్టు 25(జనం సాక్షి)** కష్టజీవుల హక్కుల కోసం, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం పోరాడిన సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శివర్గ సభ్యులు, అఖిల భారత కిషన్ సభ ఉపాధ్యక్షులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల సిపిఎం తాండూరు మండల కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మంగళవారం రోజున తాండూరు మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దాగం రాజారాం ఈ సంతాప సభలో సిపిఎం మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు దాగం రాజారాం మాట్లాడుతూ, అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుది శ్వాస విడిచిన మల్లారెడ్డి మృతి వామపక్ష, రైతు ఉద్యమాలకు తీరని లోటు అని పేర్కొన్నారు, తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో వరంగల్ జిల్లాలో విచ్ఛిన్నమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని తిరిగి పునర్నిర్మించడంలోనూ, పార్టీని, రైతు సంఘాన్ని విస్తరింపజేయడంలోనూ ఆయన ఎనలేని కృషి చేశారు. భూపోరాటాలు: ఫ్యూడల్ భావజాలానికి, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పేదలు, దళితుల భూముల పరిరక్షణ కోసం అనేక పోరాటాలు నడిపారు. మల్లారెడ్డి సోమవారం వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం తన కళ్లను దానం చేశారు. (మంగళవారం) ఆయన భౌతిక కాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించడం జరిగింది. రచయితగా, మేధావిగా: ప్రజా పోరాటాలతో పాటు సాగునీరు, రైతు సమస్యలపై ఆయన అనేక పుస్తకాలు రచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నదీ జలాలు, ప్రాజెక్టులు, వివాదాలు మరియు తెలంగాణలో సాగునీటి వనరులు-అవకాశాలపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. దిశానిర్దేశకుడు: అసెంబ్లీ, పార్లమెంటు సమావేశాలకు ముందు సిపిఎం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు ప్రజల సమస్యలపై అవగాహన పెంపొందించి, సభల్లో గళం విప్పేలా ఆయన దిశానిర్దేశం చేసేవారని రాజారాం గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన బాటలోనే నడుస్తామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దుర్గం నాన్నయ్య, వెల్పుల శంకర్, బొల్లం రాజేశం, కొమ్ము రాజయ్య, రామగిరి వరలక్ష్మి, ఊరడి సరిత, దుర్గం నాగలక్ష్మి, కే. బాపు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో దివ్యాంగులకు ప్రత్యేక జాబ్ మేళా

## 29న నియామక శిబిరం

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలోని నిరుద్యోగ దివ్యాంగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 29న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక నియామక శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి చాముపతి మల్లయ్య తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం, యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుండి 35 ఏళ్ల లోపు పదో తరగతి నుండి డిగ్రీ వరకు చదివిన శారీరక, వినికిడి, స్వల్ప దృష్టి లోపం ఉన్న దివ్యాంగులు అర్హులని, బయోడేటా, సదరం ధ్రువీకరణ, ఆధార్, విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు. హైదరాబాద్ లోని రిటైల్, ఐటీ, బ్యాంకింగ్, హాస్పిటాలిటీ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 7330637711, 9281408587 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# వెంకటాపూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జాకీర్



**వెంకటాపూర్ (రామప్ప ),ఆగస్టు25(జనం సాక్షి):-** వెంకటాపూర్ మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎస్.కే జాకీర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బూస సాంబయ్య, గొల్లెన వెంకటేష్, ప్రధాన కార్యదర్శులుగా ఎనుబోతుల తిరుపతి,మునిగాల శ్రీను,కార్యదర్శిగా రెడ్డి ఎల్లయ్య,తైనేని మధు,కోశాధికారిగా గాజుల శ్రీనివాస్,ప్రచార కార్యదర్శి గా ఛీకుర్తి రమేష్,బిసి సెల్ గ్రామ కమిటీ అధ్యక్షునిగా దూలం సంపత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎస్.కే జాకీర్ మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. వెంకటాపూర్ లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామ పెద్దలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్పంచ్ సరిత అధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**మహాదేవపూర్: ఆగస్టు 25 (జనంసాక్షి ) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సరిత అధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం సర్పంచ్ సరిత మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే రేషన్ సౌకర్యాలను మరింత సులభంగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వసంక్షేమ పథకాలుఅందేలాఅధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తారని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వాతి, రేషన్ డీలర్ రవి, గ్రామపంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణను కాపాడుదాం

## గ్రామ సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్



**పెద్దవంగర, ఆగస్టు 25 (జనం సాక్షి )** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణను కాపాడుదాం సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్ అన్నారు. మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పెద్ద వృక్షాలుగా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ఏవో స్వామి, పంచాయతీ సెక్రటరీ వెంకన్న, టీఏ సురేష్, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు మహిళాలు తదితరులు పాల్గొన్నారు.

# వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల పై కేసులు ఎత్తివేయాలి

## సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్

**తాండూర్, ఆగష్టు 25(జనం సాక్షి):**వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై షాద్ నగర్ పోలీసులు నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని సిపిఐ తాండూర్మండల కార్యదర్శి కొండు బానేష్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును నేరంగా పరిగణించడం సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు. ఈ నిరసన మరియు డిమాండ్‌కు సంబంధించిన ముఖ్యమైన అంశాలు క్రింది విధంగా ఉన్నాయి, జీవో నెంబర్ 97 వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ జీవోకు వ్యతిరేకంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ఆర్డీఓ ( ఆర్డిఓ) కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు, షాద్ నగర్ – హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న లింగారెడ్డి గూడా చౌరస్తా వద్ద విద్యార్థులు తమ సమస్యలపై పోరాటం సాగించారు, జీవో నెంబర్ 97 పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు శాపంగా మారినందున, దీన్ని వెంటనే రద్దు చేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోలీసులు లేఖ రాయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు లభించిన మద్దతు ఢ కేసుల నమోదువిద్యార్థుల ఆందోళనకు మద్దతుగా నిలిచిన కింది నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు:ఆకాష్ నాయక్ ( ఏఐఎస్ఎఫ్ నాయకుడు)శ్రీకాంత్ ( ఎస్ఎఫ్ఐ నాయకుడు)పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి (బీజేపీ నాయకుడు)శాంతియుతంగా సమస్యలపై పోరాడుతున్న వారికి మద్దతు తెలిపిన ప్రజాస్వామ్యవాదులపై కేసులు పెట్టడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కొండు బానేష్ విమర్శించారు. పోలీసుల అనుమతి ఢ ఉద్యమ కార్యాచరణఅనుమతులపై స్పష్టత: ప్రతి నిరసన కార్యక్రమానికి ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలంటే ఉద్యమాలు నిర్వహించడం



సాధ్యం కాదు. పోరాట నిర్ణయం: ఉద్యమ పరిస్థితులు, ప్రజల సమస్యలను బట్టే పోరాట కార్యాచరణ నిర్ణయించబడుతుంది. అవగాహన అవసరం: పాలిటెక్నిక్ విద్యార్థుల్లో పోలీసుల కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా ఉండవచ్చని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పోలీసులు వ్యవహరించాలని సూచించారు. భవిష్యత్తు హెచ్చరికవిద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా, ఉద్యమాలు చేస్తున్న వారిపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదని హితవు పలికారు. వెంటనే ఈ కేసులను ఎత్తివేయకపోతే సిపిఐ ఆధ్వర్యంలో కలిసివచ్చే రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, మరియు ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని, దానికి షాద్ నగర్ పోలీసులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని కొండు బానేష్ హెచ్చరించారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత-జిల్లా కలెక్టర్ రాజర్షిషా

## మొక్కలతోనే స్వచ్ఛమైన వాతావరణం-ఎస్పీ అఖిల్

**నెరడిగొండ ఆగస్టు25(జనంసాక్షి):**పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం 'వన మహోత్సవం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని వాగ్ధరి గ్రామ సమీపంలోని బోథ్ ఎక్స్ రాడ్ వద్ద జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అధికారులు,ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన మొక్కలను నాటి నీరు పోసి పచ్చదనం ప్రాముఖ్యతను చాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం పెంపొందించడం 'వికసిత్ భారత్ -2047 లక్ష్యం సాధన ధ్యేయంగా "మొక్కలు నాటుదాం --పర్యావరణాన్ని కాపాడుదాం--పచ్చని భవిష్యత్తును నిర్మిద్దాం" అని పిలుపునిస్తూ, ప్రతి ఒక్కరూ నైతిక బాధ్యతగా మొక్కలు నాటి,వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. వన మహోత్సవం కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు ప్రజలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ..



పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి అధికారి విశ్వనాథ్ బుస రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి,వాగ్దారి గ్రామ పంచాయతీ సర్పంచ్ జాధవ్ విజయ్ కుమార్ లఖంపూర్ సర్పంచ్ సిడమకి సుజాత గంగాధర్ అధికారులు,సిబ్బంది ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనాన్ని కాపాడటం ద్వారా సమతుల్య వాతావరణం

## వన సంరక్షనే మన సంరక్షణ:జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 25, జనంసాక్షి:**మొక్కలు నాటి సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమతుల్య వాతావరణాన్ని నిర్మించవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి మండలం బొక్కలగుట్ట ప్రాంతంలోని గాంధారి వనంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా భావితరాలకు సహజమైన సమతుల్య వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. చెట్ల ద్వారా మనకు కావలసిన సహజవాయువు, ఆరోగ్యకరమైన ఆహారం, ఆశ్రయం లభిస్తాయని, వర్షాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మంగళవారం రోజున 4 లక్షల మొక్కలను నాటడం జరిగిందని, జిల్లాకు నిర్దేశించిన 41 లక్షల మొక్కల లక్ష్యాన్ని దాదాపు 80 శాతం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించాలని, సమతుల్య వాతావరణ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. అనంతరం మందమర్రి మండల కేంద్రంలోని ఆర్.కె. గార్డెన్స్ లో



ఏర్పాటు చేసిన రెండు పడక గదుల ఇండ్ల లబ్ధిదారుల లక్కీ డ్రా కార్యక్రమానికి డి.సి.పి., మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాయలింగు, మండల తహసిల్దార్ సతీష్ కుమార్, ఇందిరమ్మ ఇండ్లు పి.డి. బన్సీలాల్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు రెండు పడక గదుల ఇండ్ల పథకంలో ఇండ్లు కేటాయించడం జరుగుతుందని, ఈ క్రమంలో పారదర్శకమైన కేటాయింపు కొరకు అర్హులైన లబ్ధిదారులకు లక్కీ డ్రా నిర్వహించి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు పథకం చేపట్టి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు పడక గదుల ఇండ్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా లక్కీ డ్రా పద్ధతిన పారదర్శకంగా ఇండ్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్గాం తండాలో ఘనంగా వనమహోత్సవం

**కుబీర్, ఆగస్టు 25, (జనంసాక్షి):** కుబీర్ మండలంలోని బెల్గాం తండా-1 గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అటవీప్రాంతంలోని ఖాళీ ప్రదేశాల్లో, రోడ్డుకు ఇరువైపులా వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అటవీ శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడటం, పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించాలని వారు గ్రామస్తులకు



పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు ఎఫ్ ఎస్ ఓ రవి, ఎఫ్ బి ఓ లు రాజేష్, కృష్ణ, యానిమల్ ట్రాకర్ గోరక్నాథ్, గ్రామ సర్పంచ్ గోకుల్, పంచాయతీ కార్యదర్శి ముజాహిద్దీన్, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రతిభ ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తు గడువు పొడిగింపు

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య



**మంచిర్యాల ప్రతినిధి ,ఆగస్టు 25, జనంసాక్షి:**జాతీయ ఆదాయ ఆధారిత ప్రతిభా ఉపకార వేతన పథకం క్రింద 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్ష దరఖాస్తు గడువు పొడిగించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని మోడల్ పాఠశాలలలో 2026--27 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు సెప్టెంబర్ 1వ తేదీ లోగా ఆన్‌లైన్ లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సెప్టెంబర్ 3వ తేదీలోగా జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఆన్‌లైన్ అప్లికేషన్ల హార్డ్ కాపీలను అందజేయాలని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎక్కువ మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జనరల్ / బి.సి. విద్యార్థులు 100 రూపాయలు, ఎస్.సి., ఎస్.టి., దివ్యాంగ విద్యార్థులు 50 రూపాయలు ఆన్లైన్ లో రుసుము చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# రైతు ఉద్యమానికి తీరని లోటు

## కడదాకా కమ్యూనిస్టుగా కొనసాగిన సారంపల్లి మల్లారెడ్డి



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 25, (జనంసాక్షి):**సీపీఎం సీనియర్ నేత, ప్రముఖ రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి కమ్యూనిస్టు, రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం నిర్మల్ జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ అన్నారు. మంగళవారం నిర్మల్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో మల్లారెడ్డి చిత్రపటానికి గౌతమ్ కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు ఫసి ఉద్దీన్, తొడసం శంబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతు సంఘం నిర్మాణానికి మల్లారెడ్డి విశేష కృషి చేశారని తెలిపారు. వ్యవసాయం, నీటిపారుదల రంగాలపై ఆయనకు అపారమైన అవగాహన ఉండేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీకి మార్గదర్శిగా ఉంటూ అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొన్నారని, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ సీపీఎం, రైతు సంఘం నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా, పార్టీ కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేశారు. జీవితాంతం నిరాడంబరంగా ఉంటూ కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారని గౌతమ్ కృష్ణ అన్నారు. రైతాంగ, ప్రజా సమస్యలపై ఆయన ఆశయాలను కొనసాగిస్తూ పోరాటాలు నిర్వహించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సోని, ఆత్రం సంతోష్, మెస్రం హన్మంతు, తొడసం బంటు, ప్రవీణ్, నరేష్, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో మొక్కలు నాటిన అధికారులు



**లక్ష్మణచందా, ఆగస్టు 25 (జనం సాక్షి)** లక్ష్మణచందా కేజీబీవీ పాఠశాల లో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, ఎంఈఓ నసీరుద్దీన్, గ్రామపంచాయతీ సెక్రటరీ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ బి. నవిత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

## ఊరేగింపులు, ర్యాలీల్లో విద్వేష ప్రసంగాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు జిల్లా ఎస్పీ నితికా పంత్.



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో మిలాద్-ఉన్-నబీ పండుగను శాంతియుత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా జిల్లాలోని మసీదులు, ప్రార్థనా మందిరాలు, ప్రధాన కూడళ్లు, సున్నితమైన ప్రాంతాలు, ప్రార్థనా స్థలాలు, అలాగే ఊరేగింపులు, ర్యాలీలు,ఇతర కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన మేరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలో సుమారు 250 మంది పోలీస్ సిబ్బందితో, ఆసిఫాబాద్ పట్టణంలో సుమారు 70 మంది పోలీస్ సిబ్బందితో, కెరమెరి మండల కేంద్రంలో సుమారు 50 మంది పోలీస్ సిబ్బందితో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. అదనంగా, అవసరమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్, మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. పండుగ సందర్భంగా ఊరేగింపులు, ర్యాలీలు,ఇతర కార్యక్రమాల్లో ఎవరైనా విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం, మత విద్వేషాలను రెచ్చగొట్టడం, ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడటం వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, ముఖ్యంగా యువత పండుగ సందర్భంగా సంయమనం పాటించాలని, ఎలాంటి వివాదాలకు, ఘర్షణలకు లేదా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని ఎస్పీ సూచించారు. ఊరేగింపులు, ర్యాలీల సమయంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఇచ్చే సూచనలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు.

**సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా.**

మిలాద్-ఉన్-నబీ సందర్భంగా సోషల్ మీడియాలో వదంతులు, తప్పుడు సమాచారం, విద్వేషపూరిత పోస్టులు, అభ్యంతరకరమైన వీడియోలు, ఫోటోలు లేదా సందేశాలను ప్రచారం చేయవద్దని ఎస్పీ ప్రజలకు సూచించారు. ఇతరుల నుంచి వచ్చిన అనుమానాస్పద లేదా విద్వేషపూరిత సమాచారాన్ని ఫార్వర్డ్ చేయకుండా, వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సోషల్ మీడియా వేదికలపై శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు, మత విద్వేషాలను రెచ్చగొట్టే సందేశాలు, అభ్యంతరకరమైన కంటెంట్‌పై పోలీస్ శాఖ నిఘా కొనసాగిస్తుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

**మత పెద్దలు, ప్రజాప్రతినిధులు సహకరించాలి.**

మిలాద్-ఉన్-నబీ పండుగను శాంతియుతంగా నిర్వహించడంలో మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, మిలాద్ కమిటీ సభ్యులు, యువత మరియు ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు. ప్రతి ఒక్కరూ సోదరభావం, శాంతి, సామరస్యాన్ని కాపాడుతూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని, ఇతర మతాల మనోభావాలను గౌరవించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు, వివాదాస్పద ఘటనలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు గుర్తించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మిలాద్-ఉన్-నబీ పండుగను ప్రశాంతంగా, సోదరభావంతో నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉందని, ప్రజల సహకారంతో పండుగను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు.

# రైల్వే పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి



**సిర్పూర్ టి, ఆగస్ట్ 25 (జనం సాక్షి ) :** రైల్వే హెడ్ కానిస్టేబుల్ కే. సురేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. 25 ఆగస్ట్ 2026 ఉదయం 06:30 గంటలకు ముందు ఒక గుర్తు తెలియని వ్యక్తి సిర్పూర్ (టి ) రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జ్ సమీపంలో, రైలు పట్టాలపై శవమై కనిపించాడు. మంచిర్యాల నుండి బల్లర్ష వైపు వెళ్లే ఏదో ఒక రైలు లో ప్రయాణిస్తూ, ప్రమాదవశాత్తు కింద పడడం వల్ల తలకు బలమైన గాయమై సదరు వ్యక్తి మరణించివచ్చని. మృతుని వయస్సు సుమారు 45 నుండి 50 సంవత్సరాలు. సౌత్ సెంట్రల్ రైల్వే అని వ్రాసి ఉన్న బూడిద -బ్లాక్ కలర్ హాఫ్ టీ షర్ట్, లోపల మరో రెండు షర్టు, మరియు బూడిద కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుని జేబులో కొన్ని చిత్తుకాగితాలు లభించాయి అని తెలిపారు . మృతుని బంధువుల గుర్తింపు కొరకు శవాన్ని ప్రస్తుతం సిర్పూర్ (టి ) ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ లో భద్రపరిచామని, ఈ వ్యక్తికి సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా, లేదా ఆనవాళ్లను బట్టి గుర్తుపట్టినా వెంటనే 9948481902 లేదా 8712658596 మొబైల్ నంబర్లకు సంప్రదించి సమాచారం అందించాలని రైల్వే ఇన్వెస్టిగేషన్ అధికారి కే. సురేష్ గౌడ్ కోరారు.

# పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన కుంటాల తహసిల్దార్ ఆడే కమల్ సింగ్



**కుంటాల, ఆగస్టు 25(జనం సాక్షి):** కుంటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం లలో మధ్యాహ్న భోజన నిర్వహణను మంగళవారం కుంటాల తహసిల్దార్ ఆడే కమల్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించి, వంట ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ పాటిస్తూ పౌష్టికాహారాన్ని అందించాలని, వంట గది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి యువతి పెళ్ళికి వాసవి భజన బృందం చేయూత



**బెల్లంపల్లి, ఆగస్టు 25, (జనంసాక్షి)** వాసవి భజన బృందం సహాయక సంఘం బెల్లంపల్లి ఆధ్వర్యంలో చాకెపల్లి గ్రామానికి చెందిన పులివేణి తార కీర్తిశేషులు బక్కయ్య కుమార్తె లావణ్య పెళ్ళికి చేయూత అందించారు. ఆదివారం పెళ్లి ఉన్నందున వారి ఆర్థిక పరిస్థితి బాగా లేనందున వారి స్థితిగతులు తెలుసుకొని ఆకుటుంబానికి పుస్తె, మెట్టెల గురించి పదకొండు వేల రూపాయలు వాసవి భజన బృందం తరపున అందించారు. భాస్కర్ హోమ్ నీడ్స్ కాసనగొట్టు భాస్కర్ వివాహానికి కావలసిన స్టీలు సామాన్లు, వంట పాత్రలు అందజేసి ఆదుకున్నారు. వాసవి క్లబ్ బెల్లంపల్లి అధ్యక్షుడు కొలిపాక అరవింద్ వివాహానికి కావలసిన 50 కేజీల బియ్యం, భజన బృందం కార్యదర్శి ఎలుగూరి అంజయ్య, కోశాధికారి తణుకు నందయ్య వివాహానికి కావలసిన బట్టలను వస్త్రాలను అందజేశారు. భజన సభ్యులు కొమురవెల్లి మహేందర్ 1100 రూపాయలు, భజన సభ్యుడు పాత శ్రీకాంత్ వంట నూనెను ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. పేదింటి పెళ్ళికి చేయూత అందించిన వాసవి భజన బృందానికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో భజన బృందం ప్రధాన గౌరవ సలహాదారులు చిలువేరు పద్మావతి, కార్యదర్శి అంజయ్య కోశాధికారి నందయ్య, సభ్యులు చిలువేరు శ్రీధర్ చిలువేరు శ్రీనివాస్, కాసనగొట్టు భాస్కర్, కాసన గొట్టు శశిధర్ , సలహాదారులు రేణిగుంట్ల శ్రీనివాస్, బాల సంతోష్, నలమాసు సంతోష్, మహిళా సభ్యురాలు చిలువేరు నికిత, చిలువేరు వినీత, తనకు వనజ పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో మెగా ఆయిల్ పామ్ సాగు



**గుడిహత్నూర్ , ఆగస్టు 25(జనం సాక్షి)** వన మహోత్సవంలో భాగంగా గుడిహత్నూర్ మండలంలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఉద్యాన శాఖ, పట్టుపరిశ్రమ అధికారి జి. సందీప్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయిల్ పామ్ మొక్కను నాటారు.మండలంలోని ఇద్దరు రైతులకు చెందిన 10 ఎకరాల విస్తీర్ణంలో ఒకే రోజు ఆయిల్ పామ్ మొక్కల నాటడం పూర్తి చేశారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు. మొక్కలకు 90 శాతం వరకు రాయితీ, నాలుగేళ్ల పాటు సంవత్సరానికి రూ.4,200 చొప్పున మెయింటెనెన్స్ రాయితీ, డ్రిప్ ఇరిగేషన్‌కు సబ్సిడీ అందుతుందని తెలిపారు.అలాగే గుంతలు తీయడం, మొక్కలకు నీటి సౌకర్యం కల్పించడం వంటి పనులకు ఉపాధి హామీ పథకం ద్వారా అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అనంతరం సందీప్ కుమార్ టమాటా తోటను పరిశీలించారు. ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటలుగా కూరగాయలు, ఇతర పంటలు సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ విస్తరణ అధికారి ఆదెపు శేఖర్, ఆయిల్ పామ్ అధికారులు శ్రీకర్, రవీందర్, రైతులు వినోద్, కొమురం శంభు తదితరులు పాల్గొన్నారు.

# శిశు మరణాల నివారణకు సమష్టిగా కృషి చేయాలి




**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 25, (జనంసాక్షి):** జిల్లాలో శిశు మరణాల రేటు (ఐఎంఆర్), నవజాత శిశు మరణాల రేటు (ఎన్ఎంఆర్) తగ్గించేందుకు వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ సూచించారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మార్గదర్శకత్వంలో శిశు మరణాల నివారణకు 'అంకురం' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గర్భిణులకు ప్రారంభ దశ నుంచే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, అధిక ప్రమాద గర్భాలను గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రసవం అనంతరం 42 రోజులపాటు తల్లి, శిశువు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

**నేత్రదానంపై అవగాహన:** 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని నేత్రదానం ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించాలని, నేత్రదానానికి ముందుకు వచ్చేలా వారిని ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. 'అంకురం' కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది బాధ్యతలు, వివిధ స్థాయిల్లో చేపట్టాల్సిన చర్యలను కార్యక్రమ నిర్వాహణ అధికారి డాక్టర్ సౌమ్య వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ పవన్, డాక్టర్ ఆకాష్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, డీపీఎన్‌హెచ్ఓ సాయమ్మ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ లక్ష్మీకాంత్‌తో పాటు జిల్లాలోని సామాజిక ఆరోగ్య అధికారులు, పబ్లిక్ నర్సింగ్ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పరుగు పందాల పోటీలకు సీఓఈ విద్యార్థులు




**బెల్లంపల్లి, ఆగస్టు 25, (జనంసాక్షి)** రాష్ట్ర స్థాయి పరుగు పందాల పోటీలకు బెల్లంపల్లి సీఓఈ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ విజయసాగర్ తెలిపారు. 12వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన కొంపల్లి రాకేష్, బందారి వినయ్ లను ఆయన అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి సౌత్ జోన్ కి ఎంపిక అవ్వాలని విద్యార్థులకు సూచించారు ఈ పోటీలు జెఎన్ఎస్ స్టేడియంలో ప్రారంభమవుతాయని మంచిర్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాంబశివమూర్తి, ఈగం మారయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ ఏ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీపతి, హౌస్ మాస్టర్ ఎన్ఎస్ వర్మ, మల్లికార్జున్, వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, ముచ్చుకుర్తి రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వనమహోత్సవం ఒక సామాజిక బాధ్యత

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

### జర్నలిస్టులు, పిల్లలు, అధికారులతో కలిసి మొక్క నాటిన జిల్లా కలెక్టర్



**మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 25(జనం సాక్షి):**ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అటవీశాఖ అధికారి బి.లావణ్యా తో కలిసి ఈదులపూసపల్లి లేక్ వ్యూ నేచర్ పార్క్, చెరువు ప్రాంతంలో కలిసి మొక్క నాటి, నీరు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి విస్తృతంగా మొక్కలు నాటడమే ఏకైక మార్గమని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. వనమహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు ప్రతి శాఖకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. కేవలం మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా, వాటికి ట్రీ-గార్డులు ఏర్పాటు చేసి, క్రమం తప్పకుండా నీరు పోసి కాపాడే బాధ్యతను సంబంధిత అధికారులు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రహదారుల ఇరువైపులా నాటిన మొక్కల ఎదుగుదలను ఎప్పటికప్పుడు జియో-ట్యాగింగ్ ద్వారా పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ప్రాంగణంలో లేదా పరిసరాల్లో కనీసం ఒక మొక్క నాటి, దానిని దత్తత తీసుకున్నట్లుగా సంరక్షించాలని ప్రజలను కోరారు.పుట్టినరోజులు, పెళ్లిరోజులు వంటి శుభకార్యాల సందర్భంగా జ్ఞాపకంగా మొక్కలు నాటే సంప్రదాయాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. అడవుల విస్తీర్ణాన్ని పెంచడం, పచ్చదనాన్ని కాపాడుకోవడం మనందరి ప్రాథమిక కర్తవ్యమని గ్రహించి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు.జిల్లా లక్ష్యం 43. లక్షల 51 వేలు వివిధ విభాగాలకు చెందిన వారి వారి లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం నందనవనం పార్క్ ను సందర్శించి వివిధ అభివృద్ధిపనులకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఫారెస్ట్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, ఫారెస్ట్ డివిజనల్ అధికారి ఏ. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ వినోద్, ఎఫ్ ఆర్ ఓ సురేష్, మహబూబాబాద్ మునిసిపల్ చైర్పర్సన్ జ్యోతి, మహబూబాబాద్ తాహసిల్దార్ రాజేశ్వర్, స్థానిక కౌన్సిలర్, మీడియా ప్రతినిధులు, పాటశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంచుకున్న లక్ష్యాన్ని క్రమశిక్షణతో సాధించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 25, జనంసాక్షి:**ఎంచుకున్న లక్ష్యాన్ని సంకల్పం, క్రమశిక్షణతో సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో జిల్లా కలెక్టర్, రామగుండం పోలీస్ కమిషనర్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిపుణ ఎస్.ఐ., పి.సి. ఉచిత శిక్షణ కేంద్రాన్ని రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, ఎ.ఆర్.ఎస్.ఐ. సంపత్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండే పోలీసు శాఖలో ఎస్.ఐ., పి.సి. పోస్టుల కొరకు అందిస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉత్తమ శిక్షకుల ద్వారా శిక్షణ అందించడం జరుగుతుందని, అభ్యర్థులు ఏకాగ్రతతో నేర్చుకొని సిలబస్ పూర్తి చేయాలని, అవసరమైన మెటీరియల్ అందించడం జరుగుతుందని తెలిపారు. పోటీ పరీక్షలకు పూర్తి నైపుణ్యత కలిగి ఉండాలని, ఈ క్రమంలో జరిగే ప్రిలిమ్స్ పరీక్షలలో 10 వేల మంది ఎంపిక అయితే 2 వేల లోపు ఉండాలని, మెయిన్స్ లో 2 వేలకు 1 వేయి లోపు ఉండాలని, ఆ దిశగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని సన్నద్ధం కావాలని తెలిపారు. ప్రతి సబ్జెక్టులో పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్రమం తప్పకుండా తరగతులకు హాజరై నైపుణ్యత పెంపొందించుకోవాలని తెలిపారు. ఉచిత శిక్షణ, ఉచిత పోటీ పరీక్షలకు తప్పనిసరిగా హాజరై వ్యక్తిగతంగా సామర్థ్యాన్ని తెలుసుకోవాలని, సబ్జెక్టులోని ప్రతి అంశంపై పట్టు సాధించాలని, ప్రతి విషయాన్ని నోట్ చేసుకోవాలని తెలిపారు.రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ.... పరీక్షలకు ప్రతి రోజును కౌంట్ డౌన్ చేసుకోవాలని, సెలవుతో సంబంధం లేకుండా శిక్షణకు హాజరై నైపుణ్యత, సామర్థ్యాన్ని పెంచుకోవాలని తెలిపారు. దినసరి అలవాట్లను మార్చుకోవాలని, శిక్షణపై ఏకాగ్రత పెంచుకోవాలని, ప్రతిరోజు నేర్చుకోవాలని తెలిపారు. లక్ష్యాన్ని సాధించేందుకు సంకల్పంతో ముందడుగు వేయాలని, ప్రతి పనిలో నైపుణ్యత కలిగి ఉండాలని తెలిపారు. ఉన్నత స్థానాలను సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని తెలిపారు.

# అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలి

### వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు ఆగస్టు 25 (జనం సాక్షి) :**పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామపంచాయతీ కార్యాలయాల భవనాలు, అంగన్వాడీ భవనాలు, మహిళా సంఘాల (వీవో)భవనాలు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్, పాఠశాలల్లో టాయిలెట్స్, కాంపౌండ్ వాల్స్,తదితర అభివృద్ధి పనుల పురోగతిపై మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అభివృద్ధి పనుల పురోగతి గురించి సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రగతి వివరాలను పంచాయతీరాజ్ డీఈలు, ఏఈలతో కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. అభివృద్ధి పనులు పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మంజూరైన అభివృద్ధి పనులలో ఇంకా మొదలు కాని సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీవో భవనాల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతిపై మళ్ళీ వారం రోజుల్లో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణాలకు అనువైన స్థలాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ( ఇంచార్జి )శేషాద్రి, డిఆర్డిఓ మేన శ్రీను, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్ రావు, డీఈలు శ్రీనివాస రావు, రాజగోపాల్, శిరీష, శ్రీనివాస్ రెడ్డి, ఆయా మండలాల పంచాయతీరాజ్ ఏఈలు పాల్గొన్నారు.

# భీమన్న ఆలయం వద్ద హరితహారం



**దిలావర్‌పూర్, ఆగస్ట్ 25 , (జనం సాక్షి):**దిలావర్‌పూర్ గ్రామంలోని భీమన్న ఆలయ పరిసరాల్లో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ అక్షర అనిల్ కుమార్, ఉప సర్పంచ్ సుఖేష్ మొక్కలు నాటారు. ఆలయ పరిసరాల్లోని ఖాళీ ప్రదేశాల్లో వివిధ రకాల మొక్కలను నాటారు.నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించాలని అధికారులు సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు హరితహారం దోహదపడుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ రాణి, ఎంపీఓ గోవర్ధన్, ఏపీవో దివ్యరెడ్డి, ఏపీఎం బోస్, పంచాయతీ కార్యదర్శి, టీఏలు, ఎఫ్ఏలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా వనమహోత్సవం

### మొక్కలు నాటిన ఎంఈఓ, ప్రిన్సిపాల్



**కుంటాల, ఆగస్టు 25 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కుంటాల మండల విద్యాధికారి (ఎంఈఓ) వి. ముత్యం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తుకారాం పిలుపునిచ్చారు. మంగళవారం కుంటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఎడ్యుకేషన్ అధికారి ముత్యం, ప్రిన్సిపాల్ తుకారాం, పంచాయతీ కార్యదర్శి రాజా బాపు స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని, విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపేందుకు నాటిన ప్రతి మొక్కను దత్తత తీసుకుని, అవి వృక్షాలుగా మారే వరకు సంరక్షించే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు గ్రామ పంచాయతీ తరపున నిరంతరం కృషి చేస్తామని పంచాయతీ కార్యదర్శి రాజా బాపు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చిరంజీవి, బండారి గజేందర్, కళాశాల అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు

# అవార్డు గ్రహీత కొత్త సుమలతకు ఘన సన్మానం



**ఆత్మకూర్, ఆగస్టు 25 (జనం సాక్షి):**ఆత్మకూర్ మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కొత్త సుమలత గ్రామీణ కళా రంగంలో తన నైపుణ్యత చాటుకున్నందుకు తన ప్రతిభను గుర్తించి ఇటీవలే రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ల కళా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో అవార్డు అందజేశారు. గ్రామీణ కళాకారి ని కి అవార్డు అందుకున్న కొత్త సుమలతను ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెద్దాపురం గ్రామ సర్పంచ్ ఎలుకటి రవి, ఉపసర్పంచ్ జిల్లపెల్లి కుమారస్వామి, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొని కొత్త సుమలతను అభినందించారు.ఈ సందర్భంగా ఆమెకు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# అడ్వకేట్ సుధీర్‌కు డాక్టరేట్

## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సుధీర్ కుమార్ సంగెంకు ఘనసన్మానం






**మావల ఆగస్ట్ 26( జనం సాక్షి):** సమాజ సేవ నిరంతరం చేస్తూ ,ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న వారిని ప్రత్యేకంగా సమాజం గుర్తిస్తుంది. అలాంటి కోవకే చెందుతారు అడ్వకేట్ సంగెం సుధీర్ కుమార్. ఇటీవల నిరంత సమాజ సేవకు గాను వెల్లింగ్టన్ యునివర్సిటి సౌతాఫ్రికా వారు గౌరవ డాక్టరేట్ డిగ్రీ,మరియు డే స్ప్రింగ్ యూనివర్సిటీ అమెరికా వారు అందించి ఘనంగా సత్కరించారు. మంగళ వారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం సుధీర్ కుమార్ ని ఘనంగా సన్మానించారు. ఒకవైపు న్యాయవాద వృత్తిని చేస్తూనే, సమాజ సేవలో నిరంతరం తరిస్తున్నారని పలువురు న్యాయవాదులు కొనియాడారు. ప్రముఖ యూనివర్సిటీ నుండి డాక్టర్ పొందడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. పలువురు న్యాయవాదులు కోర్టు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ సంగం సుధీర్ కుమార్ మాట్లాడుతూ ఈ డాక్టరేట్ రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని అన్నారు. మరింత సమాజ సేవ చేసి తరిస్తానని పేర్కొన్నారు. ఈ డాక్టరేట్ పట్టా రావడం నా బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ నగేష్ గారు, ఉపాధ్యక్షులు శ్రీ చందు సింగ్ గారు, సెక్రెటరీ కేమ శ్రీకాంత్ గారు, సభ్యులు కొర్రి రమణయ్య, భావన సింగ్, ముజాహిద్ ఉస్సేన్, సంగీత, సీనియర్ న్యాయవాదులు శ్రీ అమరేందర్ రెడ్డి, గంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

# ఫారం ఫండ్ నిర్మాణ పనులు

## పరిశీలించిన ఎంపీ డి ఓ రాధా రాథోడ్



**ఖానాపూర్ రూరల్ 25 ఆగష్టు (జనం సాక్షి):** ఖానాపూర్ మండలంలోనీ రంగంపేట్ గ్రామంలో నిర్మిస్తున్న ఫారం ఫండ్ నిర్మాణ పనులను ఖానాపూర్ ఎంపిడిఓ రాధా రాథోడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీ గల గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆమె అన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రంగా పెట్ సర్పంచ్ రాధా, పంచాయతీ కార్యదర్శి, ఏపీఓలు పాల్గొన్నారు.

# బ్యాంకర్లు రుణ లక్ష్యాలను సాధించాలి: జిల్లా కలెక్టర్ కె.హరిత




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 25(జనంసాక్షి )** బ్యాంకర్లు అర్హులైన వారికి నిబంధనల ప్రకారం రుణాలు అందించి రుణ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ తో కలిసి వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు వారికి నిర్దేశించిన రుణా లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ప్రక్రియ పూర్తి చేసి, రికవరీ చేసి నూతన రుణాలు అందించాలని, ఆర్థికంగా బలోపేతం చెందేందుకు ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లాలో 8 వేల 163 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ రుణాలను 100 శాతం అందించాలని, ప్రధానమంత్రి స్వనిధిలో భాగంగా అర్హులైన వారికి రుణ సదుపాయం కల్పించాలని తెలిపారు. పి.ఎం.ఎఫ్.ఎం.ఈ. క్రింద అర్హులైన మహిళ సంఘాల సభ్యులకు రుణాలు అందించాలని తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం క్రింద జిల్లాలో 341 లబ్ధిదారులకు రుణాలు అందించడం జరిగిందని, మిగతా 143 దరఖాస్తులను పరిశీలించి రుణాలను అందించాలని తెలిపారు. ప్రధానమంత్రి ముద్ర పథకం క్రింద రుణాలు చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత అందించాలని, ఎస్.సి., ఎస్.టి. నిరుద్యోగ యువతీ యువకులకు నిబంధనల ప్రకారం రుణ సదుపాయం కల్పించాలని తెలిపారు. బ్యాంకర్లు వ్యవసాయ, గృహ నిర్మాణ, విద్య సంబంధిత రుణాలు అందించడంలో నిర్లక్ష్యం వహించకూడదని, రుణాల జారీలో జాగ్రత్త వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జనార్ధన్, నాబార్డ్ జి.ఎం. వీరభద్రుడు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ జనరల్ మేనేజర్లు, మేనేజర్లు, డి.పి.ఎం., ఎ.పి.ఎం.లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుబీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు



**కుబీర్, ఆగస్టు 25, (జనంసాక్షి):** కుబీర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే (నూతన విద్యార్థుల స్వాగతోత్సవం) వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాల సీనియర్ విద్యార్థులు నూతనంగా చేరిన జూనియర్ విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విజయ్ భాస్కర్, హన్మంత్ రావ్, సంపత్, శేఖర్, శివరాజ్, శ్రీనివాస్, నర్సయ్య, నరేష్, ఉమాదేవి, రమ్య, సందీప్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. కళాశాల ప్రాంగణమంతా విద్యార్థుల కోలాహలంతో ఎంతో ఉత్సాహభరితంగా మారింది.

# 27న జిల్లా మహాధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలి



**నిర్మల్‌రూరల్:ఆగస్టు25,**(జనంసాక్షి) టీజీఈజేఏసీ పిలుపు మేరకు ఈ నెల 27న నిర్వహించనున్న జిల్లా మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. వెంగ్వపేటలో నిర్వహిస్తున్న పాఠశాల సముదాయసమావేశంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి జేఏసీ నాయకులు మాట్లాడారు.ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ భాగస్వామ్య సంఘాలైన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (టీఎస్‌యూటీఎఫ్), రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శులు పెంట అశోక్, జె. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. .

## పంటలు నమోదు చేయించుకోండి

**బెల్లంపల్లి, ఆగష్టు 25, (జనంసాక్షి)** బెల్లంపల్లి మండలంలోని రైతులు తమ పంటలవివరాలునమోదుచేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రామాల్లో పంటల నమోదు, డిజిటల్‌పంటలసర్వేనిర్వహించబడుతున్నద న్నారు.కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నియమించిన పంటల నమోదు సిబ్బంది పొలాలను సందర్శించి, సర్వే నంబర్, సాగు చేస్తున్న పంట, ఇతర పంటల వివరాలను నమోదు చేస్తారని తెలిపారు.రైతులందరికీ పంటల నమోదు చాలా ముఖ్యమైనదని, పంటల నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంట ఉత్పత్తుల కొనుగోలు తదితర ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. రైతులు పంటల నమోదు సిబ్బంది/వాలంటీర్లు మీ గ్రామానికి వచ్చినప్పుడు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి, సాగు చేస్తున్న పంటకు సంబంధించిన సరైన వివరాలను తెలియజేసి పంటల నమోదు చేయించుకోవాలన్నారు.

# విద్యార్థినుల చేత మొక్కలు నాటింపు

## గంగాపూర్ కేజీబీవీలో వన మహోత్సవం



**రెబ్బెన, ఆగస్టు25(జనం సాక్షి):** రెబ్బెన గంగాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం హాస్టల్ ఆవరణలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థినులతో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటించారు. పచ్చదనం పెంపుతో కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. “వనం ఉంటేనే జీవనం” అనే సందేశంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో గంగాపూర్ సర్పంచ్ వోల్వోజి వెంకటేశం చారి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, అటవీశాఖ అధికారులు, కేజీబీవీ ఎస్ఓ పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఏటూర్ నాగారం లోని మీసేవ మరియు ఆధార్ సెంటర్ల తనిఖీలు

## అక్రమ దందాలకు పాల్పడితే సహించబోము తహశీల్దార్ జగదీశ్వర్



**ఏటూరునాగారం,ఆగష్టు 25(జనంసాక్షి).**మండలం లోని ఆధార్ మరియు మీసేవ సెంటర్లను ఏటూరునాగారం తహసిల్దార్ జగదీశ్వర్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ మరియు రెవెన్యూ ఇన్స్పెక్టర్ కిరణ్ లతో కలిసి తనిఖీ చేశారు.ఇటీవల పలు పత్రికలలో మరియు న్యూస్ చానెల్స్ లో ప్రచురితమైన మీ సేవలో అధిక వసూళ్లు వార్త పైన ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్ మరియు మీసేవ సెంటర్లలో తనిఖీలు చేసి దరఖాస్తు దారుల నుండి అధిక రుసుము వసూలు చేయద్దు అని తీవ్రంగా ఆధార్ నిర్వాహకులను మరియు మీసేవ నిర్వాహకులను తీవ్రంగా హెచ్చరించారు.మీసేవ కేంద్రాలను ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి ఈఎస్డీ గైడ్లెన్స్ ప్రకారం మీ సేవ కేంద్రాన్ని నడపవలనని సూచించారు. మీసేవ మరియు ఆధార్ సెంటర్లో తప్పకుండా సిటిజెన్ చాప్టర్, భూభారతి కి సంబంధించిన ఫ్లెక్సీలు, మీసేవ లోగో, మరియు తహసిల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్ సెంటర్ల యొక్క ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉండవలెనని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆదేశించారు. కళ్యాణ లక్ష్మి, యుడిఐడి(సదరం), బర్త్ మరియు డెత్ సర్టిఫికెట్లు ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని మరియు మీసేవ ఆపరేటర్లు ప్రజల పట్ల సున్నితంగా ఉంటూ వారికి మీసేవ సర్వీసులను మరియు ఇతర అన్ని రకాల ఆన్లైన్ సేవలను అందించాలని ఆదేశించారు. నిర్ణీత రుసుము కంటే ఎక్కువ రుసుము దరఖాస్తుదారుడు నుంచి తీసుకున్నట్లయితే తప్పనిసరిగా అట్టి మీసేవ సెంటర్ పై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ జగదీశ్వర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్ మరియు మీసేవ మరియు ఆధార్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# రోహీర్‌లో ఘనంగా వన మహోత్సవం

## సర్పంచ్ కావిరి అర్జున్ ఆధ్వర్యంలో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు



**ఏటూరునాగారం,ఆగష్టు 25(జనంసాక్షి).**మండలంలోని రోహీర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ కావిరి అర్జున్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, మొక్కల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.ఈ సందర్భంగా సర్పంచ్ కావిరి అర్జున్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్థుల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని అన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి 100 శాతం మనుగడ సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు అనుకూలంగా ఉన్న ప్రస్తుత పరిస్థితులను సద్వినియోగం చేసుకుని మిగిలిన మొక్కల లక్ష్యాన్ని కూడా పూర్తి చేయాలని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవంలో ఇప్పటికే 86 శాతం లక్ష్యం పూర్తయిందని, మిగిలిన లక్ష్యాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వాగులు, వంకలు, రహదారుల వెంట, చెరువుల పరిసరాలు, ప్రభుత్వ స్థలాలు, శ్మశాన వాటికలు, పార్కులు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని సూచించారు. పండ్ల మొక్కలతో పాటు స్థానిక వాతావరణానికి అనుకూలమైన దేశీయ మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు మరింత మేలు జరుగుతుందని అన్నారు.అలాగే ఉపాధి హామీ కూలీలకు గ్రామంలో ప్రతిరోజూ పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని, మంజూరైన ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా శాశ్వత నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.చేయూత పెన్షన్ల విషయంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలని, అర్హత ఉన్న వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పెన్షన్ అందేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌లను కుట్టే మహిళా సంఘాలు నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలో సరఫరా పూర్తి చేయాలని సూచించారు.వన మహోత్సవం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మారాలి అని సర్పంచ్ కావిరి అర్జున్ పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే గ్రామం పచ్చదనంతో కళకళలాడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వీరు నాయక్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డోంగిరి మధుబాబు, వార్డు సభ్యులు గజ్జల అంకుల్, సోదరి రాజేష్, డోంగిరి రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ సోదరి వెంకటేష్, టెక్నికల్ అసిస్టెంట్ విగ్నేష్, కొండగొర్ల పోచయ్య, అల్లంల పోతారాజు తదితరులు పాల్గొన్నారు.గ్రామంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటడంతో గ్రామంలో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై మరింత చైతన్యం నెలకొంది.

# రంగయ్య చెరువులోకి దేవాదుల నీటిని విడుదల చేయాలి



**నల్లబెల్లి, ఆగస్టు 25 (జనంసాక్షి):** వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు దేవాదుల ప్రాజెక్టు నుంచి రంగయ్యచెరువులోకి నీటిని వెంటనే విడుదల చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలకు నీరందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి చెరువులోకి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ కిసాన్ మోర్చా పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తడుక అశోక్‌గౌడ్, మండల కోశాధికారి మనోహర్, పెరుమాండ్ల కోటి, రమేశ్, సుదర్శన్, నాగేలి ప్రకాష్, కొండ్లే రమేష్, బీజేవైఎం నాయకులు సుధగని ప్రమోద్‌గౌడ్, కడియాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వన మహోత్సవం



**నల్లబెల్లి, ఆగస్టు 25 (జనంసాక్షి)** :మండలంలోని రంగాపురం గ్రామంలో సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా గ్రామ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటడం జరిగిందన్నారు.గ్రామంలో పచ్చదనం పెంపొందించి ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. నాటిన మొక్కలను సంరక్షించి అవి పెరిగేలా చూడాలని గ్రామస్థులకు సూచించారు.ఈకార్యక్రమంలో వార్డు సభ్యుడు కోడెపాక పోశాలు, పంచాయతీ కార్యదర్శి మేడిపల్లి రామారావు, ఫీల్డ్ అసిస్టెంట్ తోటకూరి సుమన్, గ్రామ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# మల్లంపల్లి లో ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం

## మొక్కలు నాటుతున్న అధికారులు సర్పంచ్



**దుగ్గొండి, ఆగస్టు 25 (జనం సాక్షి):**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమంలో దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి గ్రామపంచాయతీ లో వనమహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.మంగళవారం మల్లంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో కమ్యూనిటీ ప్లాంటేషన్ నందు 200 మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మనము ఉత్సవ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంతాలలో ప్రజలందరూ ఒక ఉత్సాహంలా నిర్వహిస్తూ రాబోవు తరాలకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. నాటిన మొక్కలను కూడా బాధ్యతాయుతంగా కాపాడి కాలుష్యాన్ని నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూర రాధిక కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు చుక్క రమేష్ ఎంపీఓ చంద్రమోహన్ , ఏపీవో డి శ్రీనివాస్, టి ఏ సి హెచ్ బద్రు నాయక్, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జనంసాక్షి కథనానికి స్పందన

## బూడిదకు బదులు ఇసుక ప్రత్యక్షం



**డోర్నకల్ :ఆగస్టు25 జనం సాక్షి** :మహబూబాబాద్ జిల్లా డోర్నకల్: పట్టణ ప్రజల దశాబ్దాల తాగునీటి కష్టాలను తీర్చడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా కేటాయించిన అమృత్ భారత్ 2.0 పథకం కింద సుమారు 25 కోట్ల బడ్జెట్ తో డోర్నకల్ మున్సిపాలిటీలో మూడు ఓవర్ హెడ్ ట్యాంకులు,27 కిలోమీటర్ల అంతర్గత పైప్‌లైన్,1700 ఇంటింటి నల్లా కనెక్షన్ల పనులు వేగంగా సాగుతున్నాయి. ఇందిరా గాంధీ చౌరస్తా నుంచి గాంధీ కూడలి వరకు దాదాపు 600 మీటర్ల బీటీ రోడ్డు పూడ్చే పనుల్లో నాణ్యతా లోపాలపై జనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన సంచలన కథనానికి అధికారులు,గుత్తేదారుడు తక్షణమే స్పందించారు. తప్పిదాన్ని సరిదిద్దుకునే పనిలో పడ్డారు.నాణ్యమైన నది ఇసుకతో పాటు అడుగున్నర లోతు తవ్వి పూడ్చే పనులు ప్రారంభించారు.కథనానికి ముందు చేసిన పనుల సంగతి ఏంటని స్థానికంగా ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. నియమ నిబంధనల ప్రకారం మరల చేస్తారా.. లేక మమ అనిపిస్తారా అని చర్చించుకుంటున్నారు.జనంసాక్షి దినపత్రిక కథనంతో కాంట్రాక్టర్ దిగొచ్చి నాణ్యమైన పని జరుపుటకు సిద్ధమయ్యారని ప్రజాధనం వృధా కాకుండా అడ్డుకున్న జనంసాక్షి యాజమాన్యానికి,ప్రతినిధికి సిపిఎం పట్టణ కార్యదర్శి మాచర్ల సైదులు,స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సాధారణమైన విషయం

## కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 25 (జనం సాక్షి)** :పతి ఉద్యోగికి పదవీ విరమణ అనేది సహజమైన విషయమని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య రామ చంద్రం అన్నారు. సుబేదారి లోని పీజీ కళాశాల గ్రంథాలయంలో బుక్ కీపర్‌గా పనిచేస్తున్న ఈ. పాణి పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ జీవితంలో బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించిన పాణి సేవలను ఆయన అభినందించారు. పదవీ విరమణ అనంతరం పాణి ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జ్యోతి, బోధనేతర ఉద్యోగ సంఘం నాయకులు, రాజు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పాణిని భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు.